
వార్త

ఆదివారం

8 జూన్, 2025



# కట్టు తప్పుతున్న కుటుంబ జీవనం!





# 'మాస్ మహారాజ్'కి జోడీగా శంకర్ కుమార్తె

మాస్ రవితేజ కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఒక చిత్రం లాక్ అయిన సంగతి తెలిసిందే! ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర'లో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తి కాగానే పట్టాలెక్కే ప్రాజెక్ట్ కిషోర్‌దే. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నట్లు సమాచారం. ఇందులో రవితేజకు జోడీగా కేతికశర్మ, మమితా బైజు కయాదు లోహర్.. మొదలైన పేర్లు వినిపించాయి.

తాజాగా తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ కుమార్తె అదితి శంకర్ పేరు తెరపైకి వచ్చింది. అదితిపై టెస్ట్ షూట్ చేయగా రవితేజ సరసన అన్ని రకాలుగా సెట్ అయినట్లు టాక్. దీంతో అదితి ఎంపిక అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదితి శంకర్‌నే ఫైనల్ చేస్తారా? అన్నది చూడాలి. రీసెంట్‌గా 'భైరవం' సినిమాతో అదితి శంకర్ టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైంది.

'భైరవం'లో అదితి స్క్రీన్ ప్రజెన్స్‌కి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పటికే తమిళంలో బాగానే అవకాశాలు అందుకుంటోంది. యంగ్ హీరోలకు అమ్మడు పర్‌ఫెక్ట్ జోడీగా సెట్ అవుతుంది. సీనియర్ హీరోలకు ప్రమోట్ అవుతుంది. ఈ నేపథ్యంలో రవితేజ ఆఫర్ నిజమైతే అదితి శంకర్ టాలీవుడ్ కెరీర్‌లో మరో కొత్త అడుగు ముందుకు పడినట్లే! అదే నిజమైతే అదితి తండ్రి ఇమేజ్‌తో సంబంధం లేకుండా టాలీవుడ్‌లో అవకాశాలు అందుకుంటుందని చెప్పవచ్చు.

## తారాతీరం

# అదితి భావరాజు హీరోయిన్‌గా ఎంట్రీ?

టాలీవుడ్ సింగర్లు హీరోయిన్లుగా ఎంట్రీ ఇవ్వడం అనేది చాలా అరుదు. చాలా మంది యాక్టింగ్‌ను వృత్తిగా ఎంచుకోరు. గాయకులుగా కొనసాగడానికే ఆసక్తి చూపిస్తుంటారు. కొంత మందికి వెండి తెరపై కనిపించాలనే ఆసక్తి ఉన్నా సాహసించని పరిస్థితుల్లో ఉంటారు. ఈ నేపథ్యంలో తెలుగు సింగర్ అదితి భావరాజు మాత్రం మేకప్ వేసుకోవడానికి రెడీ అయింది. 'దండోరా' అనే చిత్రంలో అదితి ఓ కీలక పాత్రకు ఎంపికైంది.

తెలంగాణ గ్రామీణ ప్రాంత నేపథ్యంలో మురళీకాంత్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బలమైన ప్రేమ కథాంశంతో పాటు కఠినమైన నిజాలను, సమాజంలో కొనసాగుతోన్న అంశాలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. అదితి భావరాజుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్నో పాటలను తనదైన గాత్రంతో శ్రోతల్ని అలరించడం ఆమె ప్రత్యేకత.



తన వాయిస్‌కే ఓ ప్రత్యేకత ఉంది. బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండలో' 'జై బాలయ్య' పాటను ఆమె ఆలపించింది. ఆ పాట సూపర్ హిట్ అయింది. ఇలాంటి బ్యూటీఫుల్ సింగర్ సినిమాకు అదనపు అస్సెట్‌గా కలిసొస్తుంది. మరి ఈ సినిమాలో నటిగానే కొనసాగుతుందా? పాటలు కూడా పాడుతుందా? అన్నది తెలియాలి.

ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి మార్క్ కె.రాబిన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఆయన సారథ్యంలో అదితి భావరాజు కూడా స్వరం అందుకోవాలని అభిమానులు కోరుతున్నారు.

ఆదివారం వార్త

8 జూన్, 2025

## మంచి ముత్యాలు

– సుఖానికి దగ్గరవ్వాలంటే కష్టాన్ని అనుభవించాలి. ఈ రోజు నీది అనుకున్నది రేపు ఇంకొకరి సొంతం కావచ్చు.

– మంచివాడనిపించుకోవటానికి కొన్నాళ్లు లేదా కొన్నేళ్లు పట్టవచ్చు. చెడ్డవాడని తెలుసుకోవడానికి కొన్ని సెకండ్లు చాలు.

## కదంబం


'సంఘీ'భావం....5
సంక్షోభంలో సినిమా థియేటర్లు

కవర్ స్టోరీ..6
కట్టు తప్పుతున్న కుటుంబ జీవనం!

ఈ వారం కవిత్వం...12
అన్నీ నీవే

ఇమ్యూనిటీని పెంచే... 18

కథ..20
ప్రేమ సంకెల

సాహిత్యం.. 23
తెలుగు తేజో దీప్తి-పద్యం

శుభసూచకం 'ఆరుద్ర'.. 28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..


# సమాచారం

## అనుమతి ఉండాల్సిందే!

కొన్ని ప్రాంతాల్లో అమలు చేసే నిబంధనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. అలాంటి వింత విషయం ఇది. కమెల్ బై ది సీ నగరంలో అమలు చేస్తున్న ఓ నిబంధన. అదేమిటంటే ఆ నగరంలో రెండు అంగుళాల కంటే ఎత్తయిన హై హీల్స్ ధరించడం నిషేధం. ఒకవేళ ఎవరైనా ధరించాలని అనుకుంటే స్థానిక ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. దానికి కారణమేమిటంటే-

యుఎస్‌లోని కాలిఫోర్నియాలో ఒక చిన్ననగరం కమెల్ బై ది సీ. ఇక్కడ ఉన్న బీచ్, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. అయితే ఈ నగరంలో సైప్రెస్, పైన్ వృక్షాలు అధికంగా ఉంటాయి. ఇవి భారీగా పెరగడం వల్ల వాటి వేర్లు కూడా నగరమంతా వ్యాపించాయి. రోడ్లకు ఇరువైపులా పాదచారుల కోసం వేసిన పేవ్‌మెంట్లు, వేర్ల పెరుగుదల కారణంగా దెబ్బ తింటున్నాయి. ఎన్నిసార్లు రిపేర్ చేసినా ఫలితం శూన్యం. దాంతో పేవ్‌మెంట్లు విరిగిపోయి నడవడానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అలాంటి చోట్ల హైహీల్స్ వేసుకొని నడిస్తే కింద పడిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల 1963లోనే అప్పటి నగర అటార్నీ హైహీల్స్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ వాటిని ధరించాలని అనుకుంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్న నిబంధన విధించారు. అనుమతి తీసుకుని హైహీల్స్ వేసుకుని నడిస్తే పడిపోతే మాత్రం ప్రభుత్వం బాధ్యత వహించదు. బాధితులు ఎవరినీ నిందించే అవకాశం ఎంతమాత్రం లేదు. ఈ నగరాన్ని చూడటానికి వచ్చే చాలా మంది పర్యాటకులు హైహీల్స్ ధరించకపోయినా స్థానిక ప్రభుత్వం కార్యాలయానికి వెళ్లి అనుమతి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటారని తెలుస్తోంది. ప్రభుత్వం ముద్రించిన ధ్రువపత్రంపై దరఖాస్తుదారుల వివరాలు, అధికారి సంతకం ఉంటుంది కనుక వాటిని పర్యాటకులు ఓ జ్ఞాపకంగా దాచుకోవడం కోసం ఇలా చేస్తున్నారట. తలచుకుంటే ఐడియాలకే కొదవేముంది?



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com









వికసించుకున్న
పూలని చూస్తే ఎవరూ కళ్లు
తిప్పుకోలేరు. ఇంట్లో ఏ ఫంక్షన్
జరిగినా అలంకరణలో పూలదే ప్రథమ
స్థానమని అనటంలో సందేహం లేదు.
అలస్యం ఎందుకు వెలిగే పూలను మీ
ఇంటి అలంకరణలో
చేర్చుకోండి.



















## 'సంఘీ' భావం



# సంక్షోభంలో సినిమా థియేటర్లు

సామాన్యుడికి వినోదాన్ని అందిస్తున్న సినిమా థియేటర్లు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 40 శాతానికి పైగా థియేటర్లు ఇప్పటికే మూతపడ్డాయి. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఒక వెలుగు వెలిగిన సినిమా థియేటర్లలో చాలా వరకు మూతపడ్డాయి. గతంలో సినిమా ఒక్కటే వినోదాన్ని అందించే సాధనంగా ఉండేది. ఇద్దరు స్నేహితులుగాని, కుటుంబసభ్యులు గాని సరదాగా ఎక్కడైనా వెళ్లాలంటే కేవలం సినిమాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు వినోదాన్ని అనేక ఇతర మార్గాల ద్వారా ప్రజలు ఆస్వాదిస్తున్నారు. రిసార్టులు, హోటళ్లు, పబ్‌లు వంటివి అందుబాటులో వచ్చిన తరువాత సినిమాలకు ద్వితీయ ప్రాధాన్యత ఇస్తున్నారు. పైగా ఓటిటీలు వచ్చిన తరువాత ఇళ్లలోనే సినిమాలను ఆస్వాదిస్తున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా మల్టీప్లెక్స్‌లు వచ్చిన తరువాత సింగిల్ స్క్రీన్ థియేటర్లకు వెళ్లడానికి ప్రేక్షకులు అంతగా ఆసక్తి చూపించడం లేదు. పైగా కరోనా వచ్చిన తరువాత సినిమా థియేటర్ల నిర్వహణ సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. సినిమా థియేటర్లను అద్దె ప్రాతిపదికపై నిర్వహించడం తమ వల్ల కాదని సినీ ఎగ్జిబిటర్లు ఇటీవల ఉద్యమం చేపట్టారు. వాస్తవానికి సింగిల్ థియేటర్లు అన్నీ మూసివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు జోక్యం చేసుకుని తగిన పరిష్కారం చూపించేందుకు ముందుకు రావడంతో థియేటర్ల మూసివేత నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ముఖ్యంగా కొందరు నిర్మాతలు స్వయంగా థియేటర్ల నిర్వహణ బాధ్యతను చేపట్టడంతో మిగిలిన థియేటర్ల మనుగడ సమస్యగా మారింది. సినిమాల విడుదలను అద్దె ప్రాతిపదికన కాకుండా వాటాల (షేర్) రూపంలో ఇవ్వాలని థియేటర్ల యజమానులు కోరుతున్నారు. ఈ విధానం మల్టీప్లెక్స్‌లలో ఇప్పటికే అమలవుతున్నందున సింగిల్ స్క్రీన్ థియేటర్లకు కూడా ఇదే విధానం వర్తింపజేయాలని ఎగ్జిబిటర్లు పట్టుబట్టారు. ఈ డిమాండ్‌కు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల నుండి సానుకూల స్పందన రాకపోవడంతో థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నిర్ణయం జూన్‌లో విడుదల కానున్న హరిహర వీరమల్లు, థగ్ లైఫ్, కన్నప్ప, కుబేర వంటి పెద్ద సినిమాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఎగ్జిబిటర్ల నిర్ణయంపై తీవ్రంగా స్పందించారు. థియేటర్ల బంద్ నిర్ణయం సరైంది కాదని, ముఖ్యంగా హరిహర వీరమల్లు వంటి ప్రతిష్ఠాత్మక చిత్రం విడుదల సమయంలో ఇలాంటి ఇబ్బందులు సృష్టించడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాదం చినికిచినికి గాలివానగా మారుతుండడంతో హైదరాబాద్ తెలుగు ఫిలిం ఛాంబర్ నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో సుదీర్ఘ చర్చలు జరిపింది. ఈ సమావేశంలో దిల్ రాజు, సునీల్ నారంగ్, సి. అశ్వనీదత్, అల్లు అరవింద్, ఏఎం రత్నం వంటి ప్రముఖ నిర్మాతలు పాల్గొన్నారు. ప్రముఖ హీరోల సినిమాల విడుదల సమయంలో థియేటర్ల బంద్ నిర్ణయం సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరించారు. గతంలోనూ ఇలాంటి బంద్‌లు, షూటింగ్‌ల నిలిపివేతలు జరిగినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదని ఫిలిం ఛాంబర్ సభ్యులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు విశాఖపట్నంలో ఒక సమావేశం నిర్వహించి ఒక కమిటీని నియమించారు. ఇందులో సినీ ఎగ్జిబిటర్లతో పాటు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సభ్యులుగా ఉన్నారు. ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడను కాపాడాలన్న అంశంపై నిర్ణయాలు ఉండాలని నిర్ణయించారు. గత కొంత కాలంగా పెద్ద బడ్జెట్ సినిమాలు నిర్మిస్తున్నారు. సాధారణ కుటుంబ కథా చిత్రాలు చాలా వరకు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోతు న్నాయి. పాన్ ఇండియా సినిమాలకు కొంత గ్యారంటీ ఉండటం, ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తున్నారు. దీనితో ప్రేక్షకులు ఓటీటీ కంటే థియేటర్లకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే వీరు మల్టీపెక్స్‌లకు వెళ్లడానికి సిద్ధపడుతుండటం మరో సమస్యగా మారింది. మల్టీపెక్స్‌లలో సౌండ్ ఎఫెక్ట్స్, సీటింగ్, ఏసీ వంటి సౌకర్యాలు సింగిల్ థియేటర్ల కంటే కొంతమెరుగ్గా ఉండటంతో ప్రేక్షకులు అక్కడికే వెళుతున్నారు. దీనివల్ల కూడా సింగిల్ థియేటర్ల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోంది.

ప్రస్తుతం సింగిల్ థియేటర్లకు సినిమాలు విడుదల చేసే సమయంలో అద్దె ప్రాతిపదికన ఒప్పందం కుదుర్చుకుం టున్నారు. మల్టీపెక్స్‌లకు అయితే షేర్ విధానం అమలు చేస్తున్నారు. అద్దె ప్రాతిపదికన ఇవ్వడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నట్లు సింగిల్ థియేటర్ల నిర్వాహకులు వాపోతు న్నారు. మరోపక్క భారీ బడ్జెట్ చిత్రాలకు విడుదల చేసిన కొన్ని రోజుల వరకు టికెట్ ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తోంది. దీనివల్ల డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతకు మాత్రమే ప్రయోజనం కలుగుతుందని, తమకు ఎటువంటి న్యాయం జరగడం లేదని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంతో పాటు సినీ పరిశ్రమ తగిన చర్యలు తీసుకోకపోతే సింగిల్ థియేటర్ల మూతపడి అపార్ట్‌మెంట్లుగానో, వాణిజ్య సముదాయాలుగానో, కల్యాణ మండపాలుగానో రూపాంతరం చెందే ప్రమాదం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

డి.మురళీధర్ అమర్‌నాథ్
సీనియర్ రిపోర్టర్

# కట్టు తప్పుతున్న కుటుంబ జీవనం!



ఆధునిక ప్రపంచంలో అన్నీ డబ్బుల చుట్టూ, క్షణిక శారీరక సుఖాలు, అక్రమ సంబంధాలు, అడ్డగోలు వ్యవహారాల చుట్టే తిరుగుతున్నాయి. ఇందుకోసం కొందరు కన్నవారిని, కట్టుకున్న వారిని కూడా కడతేర్చేందుకు తెగిస్తుండడం పోలీసులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఇటీవల వెలుగు చూసిన కొన్ని దారుణాలు భారతీయ సంస్కృతిని దిగజార్చే విధంగా వున్నాయి.

ఈ దారుణాల్లో ఎక్కువగా వివాహేతర సంబంధాల వల్ల జరిగిన హత్యలే ఎక్కువగా వుండగా దీని తరువాత ఆస్తుల కోసం కన్నవారిని, అయిన వారిని కడతేరుస్తున్న కిరాతకుల ఉదంతాలూ వున్నాయి. కొన్ని ఘటనల్లో పసిపిల్లలు కూడా ఒట్టి పుణ్యానికి బలవుతున్నారు. ఇప్పటివరకు కొన్ని పాశ్చాత్య దేశాల్లోనే వున్న ఈ విష సంస్కృతి ఇప్పుడు భారత్‌ను కాలకూట విషంలా కమ్మేస్తోంది. ఇక ఈ కేసుల విచారణలో పోలీసులు వేలాది గంటల పాటు శ్రమిస్తేగానీ నిందితులు పట్టుబడడం లేదు. ఈ తరహా ఘటనలకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవడం, కుటుంబాల్లో విలువలు, కట్టుబాట్లకు ప్రాధాన్యత తగ్గడం, సోషల్ మీడియా కారణమని నిపుణులు అంటున్నారు.

కొన్ని దారుణాలు పోలీసులతో పాటు సమాజాన్ని సైతం ఉలిక్కిపడేలా చేస్తుంటాయి. ఇదే సమయంలో ఈ తరహా కేసుల విచారణ పోలీసులకు సైతం అంతు చిక్కకుండా క్రైం, సస్పెన్స్, థ్రిల్లర్‌ను తలపిస్తుంటాయి. ఈ కేసుల్లో నిజాలు వెలుగులోకి వచ్చేసరికి మానవ సంబంధాలు దిగజారుతుండడం, అయినవారి కన్నా క్షణిక శారీరక సుఖాలు, ఆర్థిక బంధాలు ఎక్కువవుతుండడం వంటి అంశాలు పోలీసులతో పాటు సమాజంలోని అన్ని వర్గాలను షాక్‌కు గురిచేస్తోంది. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో భర్తలను చంపుతున్న భార్యలు, భార్యలను హత్య చేస్తున్న భర్తలు, ప్రియుడి మోజులో పడి భర్తను, పిల్లలను చంపేస్తున్న భార్యలు, ఆస్తుల కోసం తల్లిదండ్రులను, తోడబుట్టిన వారిని కడతేరుస్తున్న వ్యక్తులు, చిన్నపాటి గొడవలకే భార్యా పిల్లలను తుపాకితో కాల్చి చంపుతున్న కుటుంబ పెద్ద వంటి దారుణాలు అనేకం వెలుగు చూశాయి.

ఈ తరహా ఘటనల్లో మొదటగా చెప్పుకోవాల్సింది.. 2017లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ ఓ బ్యూటీషియన్, దీని తరువాత కొన్ని గంటలకే సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డ నాటి కుకునూరుపల్లి ఎస్‌ఐ ఉదంతం గురించి. వీరిద్దరి వరుస ఆత్మహత్యలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపాయి. బ్యూటీషియన్‌ది ఏపిలోని పశ్చిమ గోదావరి జిల్లా, ఎస్‌ఐది తెలంగాణలోని యాదాద్రి జిల్లా. ఇద్దరికి కేవలం కొన్ని రోజుల పరిచయం మాత్రమే. ఇంకా చెప్పాలంటే వ్యక్తిగతంగా ఇద్దరికున్న పరిచయం కొన్ని గంటలు మాత్రమే. అయినప్పటికీ ఒకరి మరణానికి మరొకరు కారకులై పోలీసులను మూడు రోజుల పాటు ఉరుకులు పరుగులు పెట్టించారు. ఈ కేసులో ఇద్దరి ఆత్మహత్యల కన్నా అంతకు ముందు దిగజారుతున్న మానవ సంబంధాలు, దారి తప్పుతున్న ఉద్యోగ ధర్మం, స్నేహ బంధాలు పోలీసులను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ కేసులో బ్యూటీషియన్ గురించి చెప్పుకుంటే 30 యేళ్ల ఈ యువతికి భర్త 12 యేళ్ల కూతురు వుంది. అయినప్పటికీ తనకు ఉద్యోగం ఇచ్చిన విజయవాడకు చెందిన ఓ యువకుడితో నాలుగేళ్లుగా అనైతిక సంబంధం కొనసాగిస్తోందని పోలీసుల విచారణలో తేలింది. ఇక ఈమె భర్త అమాయకుడని పోలీసుల విచారణలో తేలింది. భార్య అనైతిక సంబంధాల గురించి తెలుసుకోలేకపోయాడు. ఇదే సమయంలో బ్యూటీషియన్‌తో సంబంధం వున్న యువకుడిని పెళ్లి చేసుకోవాలనుకున్న మరో యువతి వీరి మధ్య రావడంతో వివాదం మొదలై– చివరకు వ్యవహారం ఇద్దరి ఆత్మహత్యకు దారితీసింది. బ్యూటీషియన్‌తో సంబంధం కలిగిన యువకుడికి ఎస్‌ఐతో పరిచయం వుండగా దీని కారణంగా బ్యూటీషియన్‌ను దూరం పెట్టాలని ఆ యువకుడు అనుకున్నాడు. దీంతో బ్యూటీషియన్‌ను తీసుకుని కుకునూరుపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లగా అక్కడ సదరు ఎస్‌ఐ, బ్యూటీషియన్‌కు మధ్య గొడవ జరిగింది. దీని తరువాత బ్యూటీషియన్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా ఈ ఆత్మహత్య ఘటన కలకలం సృష్టించడంతో ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తన కారణంగానే బ్యూటీషియన్ ఆత్మహత్యకు పాల్పడిందని భయపడి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## కట్టుబాట్లు లేకపోవడం..

అంతకుముందు నల్లగొండ జిల్లాలో మామ-కోడలి మధ్య కొనసాగిన అక్రమ సంబంధం రెండు జీవితాలను బలిగొంది. తన కుమారుడి భార్యను కన్నకూతురిలా చూసుకోవాల్సిన ఓ మామ దీనికి భిన్నంగా కోడలిపై కన్నేశాడు. ఇక మామను తండ్రితో సమానంగా భావించాల్సిన యువతి వావి వరుసలు పక్కనపెట్టి మామతో రంకు వ్యవహారం కొనసాగింది. వీరి వ్యవహారం ఏడాది పాటు కొనసాగాక రట్టయ్యి రైల్వే స్టేషన్‌లోనే విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఇక హైదరాబాద్‌లో రెండు వేరు వేరు ఘటనల్లో గడచిన మూడేళ్ల వ్యవధిలో పది మంది మహిళలు వివాహేతర సంబంధం కారణంగా తమ భర్తలను అంతమొందించి జైలుపాలయ్యారు. మరికొన్ని ఘటనల్లో మరో ఎనిమిది మంది తమ భార్యలను భర్తలు హత్య చేసి జైలుకు వెళ్లారు.

ఈ ఘటనల్లో వారి పిల్లలు అనాథలుగా మారారు. వీటన్నింటికి భిన్నంగా నాగర్‌కర్నూలులో స్వాతి అనే మహిళ రాజేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని భర్త సుధాకర్ రెడ్డిని దారుణంగా హత్య చేసిన వైనం సినిమా థ్రిల్లర్‌ను మించిపోయింది. భర్తను హత్య చేశాక శవాన్ని అటవీ ప్రాంతంలో పెట్రోలు పోసి దహనం చేసింది. దీని తరువాత తన ప్రియుడు రాజేష్ ముఖానికి కొన్ని రకాల క్రీములు రాసి, యాసిడ్ దాడిగా అందరిని నమ్మించింది. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. మెజిస్ట్రేట్‌ను కూడా బురిడి కొట్టించింది. తన భర్త ముసుగులో వున్న రాజేష్‌ను హైదరాబాద్‌లో ఓ బడా ఆసుపత్రిలో చేర్పించి అత్తింటి వారిచేత ఐదు లక్షల రూపాయల బిల్లు కూడా కట్టించి చివరకు పోలీసుల విచారణలో దొరికిపోయి ప్రియుడితో పాటు జైలు పాలయ్యింది. ఈ ఘటనలో ఆమె తల్లిదండ్రులు ఆస్తులను అమ్మేసి పిల్లలతో మరో ఊరికి మకాం మార్చారు.

ఇక వీటన్నింటికి భిన్నంగా వెలుగు చూసిన ఘటన





హయత్‌నగర్‌లో రట్టయిన ఓ యువతి ఉదంతం. 19 ఏళ్ల ఈ యువతి మైనర్‌గా వున్నపుడే మరో యువకుడితో రంకు నడిపి, ఆనక గర్భం దాల్చి ఇంకో అనే యువకుడితో కలిసి అబార్షన్ చేయించుకుంది. ఈ క్రమంలో ఈమెతో సంబంధం కలిగిన రెండవ యువకుడితో అనైతిక సంబంధం పెట్టుకుని జల్సా చేసింది. చివరకు ఇతని బ్లాక్ మెయిలింగ్‌కు లొంగిపోయి అతనికి భారీగా డబ్బులు ఇవ్వడంతో పాటు కన్నతల్లిని చంపేసి ఆమె శవాన్ని మూడు రోజుల పాటు ఇంట్లో వుంచి వాసన రావడంతో రైలు పట్టాలపై పడవేసింది. ఈ కేసులో పోలీసులు




తమదైన శైలిలో విచారణ చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనలో ఇంటి పెద్ద అయిన వ్యక్తి డబ్బు సంపాదనపై దృష్టి పెట్టి కుటుంబం విషయాన్ని పట్టించుకోకపోవడం పెద్ద వెలితిగా తేలగా, అతని భార్య వడ్డీ వ్యాపారంలో డబ్బులు సంపాదించినా తన కూతురు పెడదారి పట్టిన విషయాన్ని గమనించలేకపోయి చివరకు తానే బలయ్యింది. ఈ వ్యవహారంలో కట్టుతప్పిన కుటుంబ వ్యవస్థ, దిగజారిన మానవ సంబంధాలు, క్షణిక శారీరక సుఖాలు తెరమీదకు వచ్చాయి.

ఇక నాలుగేళ్ల క్రితం జగిత్యాలలో వెలుగు చూసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దీప్తి హత్య. తన ఇంట్లోనే దీప్తి మరణించి వుండగా ఇదే సమయంలో ఆమె సోదరి చందన అదృశ్యమయ్యింది. ఇదే సమయంలో ఇంట్లోని కోటిన్నర రూపాయల నగలు, నగదు కనిపించకుండా పోవడం సంచలనం రేపింది. దీని తరువాత అక్క మద్యం తాగి పడిపోతే తాను ప్రియుడితో కలిసి వెళ్లిపోయినట్లు దీప్తి సోదరి చందన వాయిస్ మెసేజ్ పంపడం సంచలనం రేపింది. అయితే దీప్తికి హత్యగానే భావించిన పోలీసులు ఆ కోణంలోనే విచారణ చేబట్టారు. పరారీలో వున్న ఆమె సోదరి చందనను అతి కష్టం మీద మూడు రోజుల తరువాత పట్టుకుని హైదరాబాద్‌కు తరలించి విచారించగా తన సోదరిని తానే హత్య చేసినట్లు అంగీకరించింది. తాను ముస్లిం యువకుడైన సుల్తాన్‌ను ప్రేమించగా తన ప్రేమను అక్కతో పాటు కుటుంబ సభ్యులు అంగీకరించలేదని, దీంతో తల్లిదండ్రులు లేని సమయంలో తన ప్రియుడు, అతని తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి అక్కను చంపినట్లు అంగీకరించింది. అప్పటికే మద్యం తాగి మత్తులో వున్న సోదరి దీప్తి ముక్కు, నోటికి ప్లాస్టర్ వేసి, మెడకు చున్నితో బిగించి చంపినట్లు చందన చెప్పడం పోలీసులకు షాక్‌కు గురిచేసింది. ఈ కేసులో చందన మేజర్. ఆమె తన ప్రియుడు సుల్తాన్‌ను పెళ్లి చేసుకోవాలని అనుకుంటే ఎవరూ అడ్డుచెప్పరు. ఇందుకోసం అక్కను మద్యం మత్తులో దింపి హత్య చేయాల్సిన అవసరం లేదు. కేవలం ప్రియుడిని పెళ్లాడేందుకు, అతనితో శారీరక సుఖం పొందేందుకు, ఇంట్లోని నగదు, నగలతో ఉడాయించేందుకు చందన ఒక క్రిమినల్ స్థాయిలో ఆలోచించి మరీ దారుణానికి ఒడిగట్టడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. దీప్తి హత్య కేసులో చందనతో పాటు ఆమె ప్రియుడు సుల్తాన్, అతని కుటుంబ సభ్యులు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మధ్య జరిగిన దారుణాల్లో మొదటగా వరంగల్ జిల్లా హనుమకొండలో ఫిబ్రవరి నెలలో జరిగిన యువ వైద్యుడు సుమంత్ రెడ్డి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఆసుపత్రి నుంచి కారులో వస్తున్న అతన్ని గుర్తు తెలియని దుండగులు దాడిచేసి తలపై సుత్తితో కొట్టడం తెలిసిందే!

ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ అతను ఎనిమిది రోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించాడు. దీనిపై విచారణ చేబట్టిన పోలీసులు ఈ దారుణానికి వైద్యుడి భార్య ఫ్లోరా మారియా, ఆమె ప్రియుడు శామ్యూల్, వారి సహచరుడు సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా వున్న రాజ్‌కుమార్‌లు కారణమని తేలింది. వైద్యుడి భార్య శామ్యూల్‌తో వున్న అక్రమ సంబంధం కారణంగా వైద్యుడు హత్యకు గురయ్యాడు. దీని తరువాత ఇటీవల మహబూబాబాద్ జిల్లా శనిపురంలో జరిగిన హెల్త్ సూపర్ వైజర్ పార్థసారథి హత్య ఈ కోవలోకే వస్తుంది. ఇతని భార్య స్వప్న తన ప్రియుడు టీచర్‌గా వున్న విద్యాసాగర్‌తో కలిసి మరో ఇద్దరు కిరాయి హంతకులను నియమించుకుని భర్తను చంపేసి ఏమీ ఎరగనట్లు నటించగా పోలీసుల విచారణలో బండారం రట్టయ్యింది. ఈ ఘటనలో ఐదేళ్లలోపు వున్న ఈ దంపతుల ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. దీని తరువాత నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో విఠల్ రెడ్డి అనే రైతును అతని భార్య కాశవ్వ ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు కాగా ఒకరికి వివాహం జరిగింది. మరో ఇద్దరి వివాహం కుదిరిన దశలో తల్లి ఇలాంటి నీచానికి దిగింది. ఈ ఘటన తరువాత విఠల్ రెడ్డి కుటుంబం పరువు ప్రతిష్టలు ఊళ్లో మంటకలిశాయి. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో రజిత అనే మహిళ ప్రియుడి మోజులో 12, 10, ఎనిమిదేళ్ల ముగ్గురు పిల్లలను గొంతు నులిమి చంపేసింది. ఈ కేసులో ట్విస్ట్ ఏమిటంటే రజిత కంటే ఆమె భర్త 20 యేళ్లు పెద్దవాడు. మొదటి భార్య చనిపోవడంతో రజితను రెండవ వివాహం చేసుకున్నాడు. వీరికి పెళ్లయి 14 యేళ్లయ్యింది. 15 యేళ్ల క్రితం పదవ తరగతి చదివినవారు గెట్ టు గెదర్ పార్టీ చేసుకుంటే నాటి స్నేహితుడు కలవగానే అతనితో గతంలో వున్న పాత జ్ఞాపకాలను నెమరేసుకుని అతనితోనే కలిసి జీవించాలని అనుకుంది. ప్రియుడు చెప్పినట్లు ముగ్గురు పిల్లలను రజిత చంపేసింది.



తరువాత భర్తను హత్య చేసేందుకు అన్నంలో విషం కలిపింది. అయితే ఆ అన్నం అతను తినకపోవడంతో బతికిపోయాడు. తరువాత తనకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని నాటకమాడింది. పోలీసుల విచారణలో అన్ని విషయాలు వెలుగు చూడడంతో ప్రియుడితో కలిసి కటకటాల పాలైంది. తాజాగా జీడిమెట్లలో తేజస్విని అనే మహిళ అనారోగ్యంతో బాధపడు తున్న ఇద్దరు కుమారులను హత్య చేసి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కూడా సంచలనం రేపింది.

ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో మధ్యప్రదేశ్‌లో ఓ మహిళ ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసి సెల్‌ఫోన్‌లో ఈ దృశ్యాలను ప్రియుడికి చూపించింది. ఈ ఘటనలో నిందితులు అరెస్టయ్యారు. అంతకు ముందు యుపిలో మర్చంట్ నేవీ మాజీ అధికారి సౌరభ్‌ను అతని భార్య ముస్కాన్, ప్రియుడు సాహిల్‌లు కలిసి చంపేసి, శవాన్ని సిమెంట్ డ్రమ్ములో దాచిపెట్టి చివరకు దొరికిపోయారు. తాజాగా ఈ తరహా ఘటనలు యుపిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మరో రెండు వెలుగు చూశాయి.

## కిరాయి హంతకుల హల్‌చల్.. ప్రేమికుల నుంచి రాజకీయ నేతల వరకు అనేక మంది హతం

ఇక కిరాతక హత్యల పరంపరలో సుఫారి హంతకులది ప్రత్యేక పాత్రగా చెప్పాలి. ఉమ్మడి ఏపి హయాంలో జంట నగరాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా హత్యలు, కిడ్నాప్‌ల వెనుక కిరాయి హంతకుల పాత్ర వెలుగు చూశాయి. ఇందులో కొందరు నేరగాళ్లు నరరూప రాక్షసులుగా పేరుగాంచారు. సినిమాల్లో చూపించినట్లు ఒకరి వద్ద నుంచి డబ్బులు తీసుకుంటే చాలు.. పనిపూర్తయ్యే వరకు నిద్రపోయేవారు కాదు. అనేక హత్యల్లో నిందితులుగా వున్న వీరు ఇదే సమయంలో బడా వ్యాపారులను, వారి పిల్లలను కిడ్నాప్ చేసి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఉదంతాలు కూడా వున్నాయి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పోలీసు శాఖ బలోపేతం అవడంతో తీవ్రమైన నేరాలతో పాటు సాధారణ నేరాలు కూడా తగ్గుముఖం పట్టినా కిరాయి హంతకుల హల్‌చల్ మాత్రం తగ్గలేదు.

మిర్యాలగూడలో 2018 ఏప్రిల్ నెలలో జరిగిన ప్రణయ్ అనే యువకుడి హత్యోదంతంలో కిరాయి హంతకుల పాత్ర వుంది. మారుతీరావు అనే వ్యాపారి తన కూతురు అమృత మరో కులానికి చెందిన యువకుడిని పెళ్లి చేసుకుందనే పగతో అల్లుడిని అంతమొందించేందుకు యుపి నుంచి కిరాయి హంతకులను రంగంలో దింపి ప్రణయ్‌ను హత్య చేయించాడు, ఈ హత్య అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. పోలీసులు కూడా ఈ కేసును తీవ్రంగా పరిగణించి స్వల్ప వ్యవధిలోనే అందరిని కటకటాల్లో నెట్టారు. నిందితులకు ఇటీవలే జీవిత ఖైదు శిక్ష పడింది. ప్రణయ్ హత్య తరువాత హైదరాబాద్ నడిబొడ్డున పంజగుట్ట వద్ద వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎదుట నాలుగేళ్ల క్రితం విజయవాడకు చెందిన రాంప్రసాద్ అనే స్టీల్ వ్యాపారిని కిరాయి హంతకులు దారుణంగా చంపేశారు. ఆర్థిక లావాదేవీలే ఈ హత్యకు కారణమని తేలింది. ఈ హత్యకు కారణమైన విజయవాడకు చెందిన మరో వ్యాపారి తాను అమాయకుడినని నమ్మించేందుకు కిరాయి హంతకుల చేత రకరకాల ట్రిక్కులు ప్రయోగించినా పోలీసుల ముందు అతని ఆటలు సాగలేదు. చివరకు అందరు నేరగాళ్లను పోలీసులు జైలుకు తరలించారు. ఈ హత్య తరువాత సూర్యాపేట జిల్లా యార్కారం గ్రామంలో మాజీ సర్పంచ్ ఒంటెద్దు వెంకన్న యాదవ్ హత్యోదంతంలోనూ కిరాయి హంతకుల పాత్ర వెలుగు చూసింది. వెంకన్న యాదవ్‌ను ప్రత్యర్థులు రైలు పట్టాలకు వాడే దృఢమైన ఇనుముతో తయారు చేసిన బలమైన తల్వార్లతో వేటాడి, వెంటాడి మరీ హత్య చేయడం పోలీసులను షాక్‌కు గురిచేసింది.



గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మాజీ నక్సలైట్, గ్యాంగ్‌స్టర్ నయీం అనేక మందిని కిరాయి హంతకులచేత చంపడం తెలిసిందే. ఇందులో మాజీ నక్సలైట్లతో పాటు కొందరు రాజకీయ పార్టీల నాయకులు కూడా వున్నారు. హైదరాబాద్ పాతబస్తీలోనూ కిరాయి హంతకులు ప్రత్యర్థులను హతమార్చిన ఉదంతాలున్నాయి.

## సాక్షులను రక్షించే ప్రత్యేక వ్యవస్థ లేకపోవడం పెద్ద వెలితి

ఇదిలా వుండగా హత్యలతో పాటు హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడాలంటే సాక్షులు కోర్టులో సాక్ష్యం చెప్పాల్సి వుంటుంది. నిందితులకు శిక్షలు పడాలంటే ఇది ఎంతో ముఖ్యం. అనేక దేశాల్లో సాక్షులను కాపాడుకునే వ్యవస్థ వుంది. ఈ వ్యవస్థను విట్‌నెస్ ప్రొటెక్షన్ సిస్టం అని పిలుస్తుంటారు. ఈ వ్యవస్థ పటిష్టంగా వుండేందుకు ఆయా దేశాల్లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంటారు. అవసరమైతే సాక్షులకు పోలీసు విభాగాలు తాముండే సురక్షిత ప్రాంతాలలోనే వుండే వీలు కల్పించడంతో పాటు ఇదే ప్రాంతంలో ఉద్యోగాలు కూడా ఇస్తారు. ఇక కోర్టుల్లో వీరి సాక్ష్యాల ఆధారంగా నిందితులకు శిక్షలు పడిన తరువాత సాక్షులుగా వున్నవారిని పోలీసులు మరికొంత కాలం సురక్షితంగా కాపాడుతారు. ఈ తరహా వ్యవస్థను ఇండియాలోనూ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ దశాబ్దాలుగా అనుకుంటున్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఈ కారణంగా హత్యలు, హత్యాయత్నాల వంటి కేసుల్లో నిందితులు సాక్షులను ప్రలోభ పెట్టడం, లేదా తమకు అనుకూలంగా మలచుకుని కోర్టులకు రాకుండా చేయడం, ఒకవేళ వచ్చినా సాక్ష్యం చెప్పకుండా చేసి కేసుల నుంచి సులభంగా తప్పించుకుంటున్నారని న్యాయ నిపుణులతో పాటు సీనియర్ న్యాయవాదులు అంటున్నారు. ఇక హత్య కేసుల్లో నిందితులుగా వున్న వారిలో చాలా మంది బెయిలుపై విడుదల కాగానే ప్రత్యర్థుల చేతిలో దారుణంగా హత్యకు గురవుతున్నారు. ఈ తరహా ఘటనలు కూడా ఇటీవల కాలంలో హైదరాబాద్‌తో పాటు శివార్లలో పెరిగిపోయాయి. ఇలా ఒక హత్యకు మరో హత్యగా మారుతూ హత్యల పరంపర ఆగకుండా కొనసాగుతోంది. ఈ విషయంలో పోలీసు విభాగం ఇకనైనా దృష్టి సారించాల్సిన అవసరం వుందనడంలో ఎలాంటి సందేహం లేదు. హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన వారికి కర్నాటకతో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో వున్నట్లుగా ఏడాదిన్నర నుంచి రెండేళ్ల పాటు బెయిలు రాకుండా చూసేలా చట్టాలను మార్చాలని, ఈ వ్యవధిలోనే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసి నిందితులకు జీవిత ఖైదు శిక్షలు పడేలా చేయడం ద్వారా హత్యలు, హత్యా యత్నాల వంటి తీవ్రమైన నేరాలకు ఫుల్‌స్టాప్ పెట్టవచ్చని న్యాయ నిపుణులు అంటున్నారు.

## ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవడం, సామాజిక కట్టుబాట్లు సవ్యంగా లేకపోవడం దారుణాలకు కారణమంటున్న నిపుణులు.. ఆధ్యాత్మికత పెంచగలిగితే చాలావరకు సమస్యలకు పరిష్కారం

దేశ వ్యాప్తంగా జరుగుతున్న కిరాతక హత్యలపై సామాజిక, మానసిక నిపుణులు భిన్నంగా స్పందించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవడం, సామాజిక కట్టుబాట్లు సవ్యంగా లేకపోవడం ఈ తరహా దారుణాలకు ప్రధానకారణమని వారంటున్నారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వున్న సమయంలో చిన్న పిల్లల నుంచి పెద్దవారు వరకు అందరు పద్ధతిగా వుండే వారని, నేటి ఆధునిక ప్రపంచంలో ఉమ్మడి కుటుంబం పూర్తిగా అంతరించడంతో కట్టుబాట్లను ఎవరూ పట్టించుకోవడం లేదని నిపుణులు అంటున్నారు. భారతదేశం గొప్పతనమే కట్టుబాట్లు, సాంప్రదాయమని, విదేశాల్లో భారత్‌కు ఈ ఒక్క అంశమే గుర్తింపును తెచ్చి పెట్టిందని వారంటున్నారు.

అమెరికా సహా అనేక యూరప్ దేశాల్లో విచ్చలవిడితనం ఎక్కువగా వుండగా భారత్‌లో ఇవి లేకపోవడం వల్లే దేశంలో కుటుంబాలు నేటికి మనగలుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ వ్యవస్థే భారత్‌కు అతిపెద్ద బలం అని వారంటున్నారు. కానీ ఇటీవల కాలంలో సోషల్ మీడియా ప్రభావం, సామాజిక కట్టుబాట్లను అనేకమంది పాటించక



పోవడం వల్ల కుటుంబాల్లో భర్తలను భార్యలు, భార్యలను భర్తలు, ఆఖరుకు కడుపున పుట్టిన పిల్లలను సైతం చంపుకుంటున్న దౌర్భాగ్య ఘటనలు వెలుగు చూస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

ఇక ఇటీవల కాలంలో ఆధ్యాత్మిక భావన చాలా మందిలో తగ్గుతుండడం కూడా కుటుంబాల్లో చిచ్చు రేగడానికి ఒక కారణంగా నిపుణులు చెబుతున్నారు. ఆధ్యాత్మికత వల్ల ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెరిగి, మనస్సు ప్రశాంతంగా వుండడం వల్ల కోపాలు, తాపాలు, ప్రతీకారాలు తగ్గి వీలుంటుందని, ఇదే సమయంలో కుటుంబ విలువలు, సామాజిక కట్టుబాట్లు మరింత పెరుగుతాయని వారంటున్నారు.




## పొదుపు

రమణమ్మ: "మీ ఫ్యాన్‌కి ఒక రెక్కే వుందేమిటి?" అంది రంగమ్మతో.

రంగమ్మ: "మా వారు చాలా పొదుపరి. కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుందని ఫ్యాన్‌కు రెండు రెక్కలు తీసేసాడు."

## వడగాలి

టీచర్: "చింటూ! వడగాలి అంటే ఏమిటి?"

చింటూ: "వడలు చేస్తూ వుంటే వడల నుండి వచ్చే వేడి గాలినే వడగాలి అంటారు టీచర్"

టీచర్: ఆ...



## చాలా పెద్దది

మిత్రులైన ముగ్గురు దొంగలు ఒక చోట కలుసుకున్నారు.

మొదటి దొంగ: "నేను బంగారం, నగదు, విలువైన సామగ్రి దోచుకొచ్చాను" అన్నాడు.

"నేను టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను ఎత్తుకొచ్చాను" అన్నాడు రెండో దొంగ.

"నేను మీ ఇద్దరికంటే పెద్దదాన్ని దోచుకొచ్చాను" అన్నాడు.

"ఏమిటది?" ఇద్దరు దొంగలు ఒకేసారి అడిగారు.

"రోడ్డురోలర్" సమాధానమిచ్చాడు మూడవ దొంగ.

ఇంకేముంది.. ఇద్దరు దొంగలు స్పృహ తప్పి పడిపోయారు.

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ

## పక్కవాడూ నష్టపోయాడు..

రకరకాల అవక తవకలకు పాల్పడిందని వార్తలు రావడం వల్ల సుబ్బారావు కంపెనీ షేర్ల ధరలు బాగా పతనమయ్యాయి అని తెలిసి కూడా సంతోషంగా ఉన్నాడు.

కారణమేమిటంటే తన ప్రత్యర్థి కంపెనీ షేర్లు మరింతగా పడిపోయాయి కాబట్టి.

**- కె.లహరి**

## సీరియల్ చూడాలి

పోలీస్: నువ్వు ఆ ఇంట్లో దొంగతనం చేసి వెళ్ళేటప్పుడు భర్త, పిల్లలు అందరి కాళ్ళూ చేతులు కట్టి భార్యకి కట్టకుండా వదిలావు. కారణం?

దొంగ: "నేను టీవీలో సీరియల్స్ చూడాలి, కాబట్టి రిమోట్ చేతిలో ఉండాలి తాడుతో నన్ను కట్టేయకు" అంటూ ఆ ఇల్లాలు ఎంతగానో బతిమిలాడింది.

## కోర్టులో..

జడ్జి: "నీవు మొదటి దొంగతనం ఎక్కడ చేసావు?"

దొంగ: "ఇంతకు ముందు ఏదో పని మీద కోర్టుకి వచ్చినప్పుడు లాయర్ జేబులో 'సెల్' దొంగతనం చేశాను.

## భార్య వండుతోంది

హోటల్ యజమాని: ఇంతకు ముందు ఇక్కడికి చాలా రేర్‌గా వచ్చేవాడివి కదా! ఇప్పుడు రోజూ వస్తున్నావు? మీ ఆవిడ ఊరెళ్లారా?

కస్టమర్: ఇంతకు ముందు పెళ్లి కాలేదు కాబట్టి నేనే వండుకునేవాడిని, పెళ్లి అయింది కనుక మా ఆవిడ వండుతోంది.

## తావీదు మహిమ

భూత వైద్యుడు: "ఈ తాయత్తు ఇంటికి తీసుకెళ్ళి కట్టుకో, ఆరోగ్యం కుదుట పడుతుంది"

(వారం రోజుల తర్వాత)

కస్టమర్: "మీరు చెప్పినట్లే కట్టాను, అయినా ఆరోగ్యం మెరుగు పడలేదు"

భూత వైద్యుడు: "అదేంటి? లెక్క ప్రకారం ఆరోగ్యం మెరుగు కావాలే?"

కస్టమర్: "మేకు గట్టిగా కొట్టి మరీ తాయత్తు కట్టాను"

భూత వైద్యుడు: "ఎంత పని చేసావు? కట్టమన్నది ఇంటికి కాదు, నీ చేతికి!"

**- ఎస్ కె. యాకూబ్ పాషా,** ఖమ్మం.

## భోజనం తరువాతనా?

డాక్టర్: "చూడు నాయనా! నీకు ఒళ్లు తగ్గాలంటే ఓ రెండు నెలలు మధ్యాహ్నం రెండు చపాతీలు, రాత్రుళ్ల ఒక చపాతి తినాలి"

పేషెంట్: "సరే డాక్టర్! కానీ నాకో సందేహం. ఈ చపాతీలు భోజనం చేసే ముందు తినాలా? భోజనం చేసిన తరువాత తినాలా?"

## టిప్ ఇస్తే స్పెషల్

కస్టమర్: "స్పెషల్ దోసెకు, సాదా దోసెకు ఏంటి తేడా?" అడిగారు సప్లయర్‌ని.

సప్లయర్: "టిప్ ఇస్తే స్పెషల్ దోసె తెస్తానండి. టిప్ ఇవ్వకపోతే సాదా దోసె తెస్తాను" సమాధానమిచ్చాడు.

## దొందూ దొందే!



"సార్, ఈ మధ్య నాకు ఒక మనిషి ఇద్దరిలా కనిపిస్తున్నారండీ! నా కళ్లు మామూలుగా కనిపించేలా ఏదైనా మంచి మందు ఇవ్వండి డాక్టర్" అన్నాడు డాక్టర్‌తో ఓ వ్యక్తి.

"ఇస్తా సరేగానీ, ఈ మాత్రం దానికి ఇంకొకరిని తోడు తెచ్చుకున్నావా? నువ్వొక్కడివే వస్తే సరిపోయేదిగా!" అన్నాడు డాక్టర్.

దొందూ దొందే అన్నమాట.

# క్షమాగుణం వ్యక్తిత్వానికి నిదర్శనం

**పొరపాట్లు జరగడం మానవ సహజం. నోరు జారడం నాలుక లక్షణం. అనుకోకుండానో, ఉద్దేశపూర్వకంగానో మనం కొన్ని చిన్న చిన్న తప్పులు చేస్తుంటాం. మనం చేసిన ఒక చర్యవల్ల లేదా మనం మాట్లాడిన మాటల వల్ల మన మిత్రులు లేదా బంధువుల మనస్సు నొచ్చుకోవచ్చు, తద్వారా మానవ సంబంధాలు బలహీనపడవచ్చు. మన వల్ల జరిగిన పొరపాటుకు తక్షణమే క్షమాపణ చెప్పడం వల్ల అపార్థాల మేఘాలు తొలగిపోయి మళ్లీ పూర్వపు సంబంధాలు నెలకొంటాయి.**

క్షమాపణ చెప్పడం కూడా ఉత్తమ వ్యక్తిత్వంలో ఓ ప్రధాన కళ అవుతుంది. దీనినే 'క్షమాపణ తెలిపే కళ'గా వర్ణిస్తారు. క్షమాపణ తెలుపడం అవమానకరం కాదు, అది ఆత్మన్యూనతకు దారి తీయకూడదు.

క్షమాపణ చెప్పడం వల్ల మానసిక గాయాలు మానిపోతాయి. నమ్మకాలు/విశ్వాసాలు పెరుగుతాయి. సంఘర్షణలు సమసిపోతాయి. మన ఆత్మవిశ్వాలు పెరుగుతాయి. పారదర్శకత చిక్కబడుతుంది. జవాబుదారీతనం పెరుగుతుంది. అపార్థాలతో అభిప్రాయ భేదాలు మొలిచి వేరైన ఇరు పక్షాలను ఏకం చేసే ఉత్తమ సాధనం 'సారీ' చెప్పడమే.

## క్షమాపణ చెప్పడం, క్షమించడం కూడా ముఖ్యమే!

ఇప్పుడు వ్యక్తిత్వ వికాస పాఠాల్లో క్షమాపణ అడగడం, క్షమించే గుణాలను పెంచుకోవడం కూడా ఓ ప్రధాన కళ అని వర్ణించబడుతున్నది. "ఐ యామ్ సారీ" అనే మాటకు ఓ మహత్తర శక్తి ఉంటుంది. మనం కూడా అనుకోకుండా లేదా ఉద్దేశపూర్వకంగా మరొకరి మనసును నొప్పించకుండా ఉడవచ్చుని గమనించాలి.



మాటల తూటాలకు మనసులను విరిచే మహత్తర శక్తి ఉంటుంది. ఒక్క మాట యుద్ధ వాతావరణాన్ని సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటుంది. దశాబ్దాలుగా ఒకటిగా ఉన్న వ్యక్తులను లేదా కుటుంబాలను ఓ అవాంఛనీయ మాట అడ్డుగోడలను కట్టగలదు. క్షమాపణ చెప్పడం వల్ల మనసు తేలికవుతుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. క్షమించడం వల్ల తిరిగి బలమైన మానవ సంబంధాలు పునరుద్ధరించబడతాయి.

## శక్తివంతం

క్షమాపణ తెలుపడం తప్పు చేసినట్లు కాదని, చేసిన తప్పును సవరించుకునే ఓ అద్భుత అవకాశమని తెలుసుకోవాలి. క్షమించిన వారి కన్నా క్షమాపణ కోరే వారికే ధైర్యం ఎక్కువగా ఉంటుందని గమనించాలి.

క్షమాపణ చెప్పడం ఓ భావోద్వేగ సంఘర్షణ. క్షమాపణ చెప్పకపోతే జీవితాంతం తప్పు చేశామనే మానసిక క్షోభ మనల్ని వేధిస్తుంది. మనుషుల్ని/మనసుల్ని దూరం చేస్తుంది.

'సారీ' అనే మాట సకల విభేదాలను తుడిచేసి మళ్లీ ఆనందాల అనుబంధాలను కలుపుతుంది. ఒకరిని అపార్థం చేసుకోవడం, అవమాన పర్చడం, అసంబద్ధంగా మాట్లాడడం, అగౌరవపర్చడం, మనం మాటపై నిలవకపోవడం, ఏక పక్ష తీర్పులు ఇవ్వడం లాంటివి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తాయి.

ఇలాంటి సందర్భాల్లో మన వల్ల పొరపాటు జరిగిందని గమనించి, ఆలస్యం చేయకుండా 'సారీ' చెప్పడం వల్ల ఇరు పక్షాల మనసులు తేలిక పడతాయి. మానవ సంబంధాలు పూర్వపు స్థితికి వస్తాయి. క్షమాపణ చెప్పడానికి బదులుగా కుంటిసాకులు చెప్పడం మంచిది కాదు.

భావోద్వేగ పరిపక్వత, సహానుభూతి, తప్పు చేసామని లేదా జరిగిందని అంగీకరించడం.. లాంటివి మనకు ఉండవలసిన ఉత్తమ లక్షణాలు. ఒక్క మాట విస్ఫోటనం సృష్టిస్తుంది. విభేదాల మంటలపై నీళ్లు చల్లుతుంది. మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పడం అనేది ఓ కళ. ఇది కేవలం మాటలతో కాదు, మనసుతో, సహృదయంతో చెప్పే ఒక అద్భుత ప్రక్రియ.

తప్పు చేసినపుడు క్షమాపణ చెప్పడం ఆ వ్యక్తి సానుకూలతను, సమర్థతను తెలియజేస్తుంది. 'సారీ' చెప్పడం ద్వారా సంబంధాలు బలోపేతం కావడం, అపార్థాలు తొలగిపోవడం, లోతైన ఆలోచనలకు అవకాశం దొరకడం, వ్యక్తిత్వం ఇనుమడించడం.. లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.

సరైన సమయంలో క్షమాపణ తెలుపడం సిగ్గుచేటు కాదు, చిన్నతనం అంతకన్నా కాదు. అది మన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం అని భావిస్తూ జీవనయానం కొనసాగిద్దాం. మానవ సంబంధాలను పెంచుకుందాం.

**- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**

ఈ వారం కవిత్వం

## హరిత వర్ణం హరించుకుపోయిందా?

లేచిగుళ్ళు, లేత గరికలు
గంతులెయ్యడం మానేసాయా,
వర్షాలకి బదులు రక్తాలతో
నేలతల్లి తడిచిపోతుంటే !

పిట్టలూ పాటలూ పంటలూ
పడావు పడ్డాయా
మేఘాకాశాలకి బదులు
ఆయుధ పొగలు
ఆకాశాన్ని కమ్మేస్తుంటే !
గొడవలు
మేలిమి గుణాల కోసం పడాలి
మలిన రణాల కోసం కాకుండా !

మనుషుల అసువుల
అసలు సంగతి మతించాలి
గండ పుండు మోక్ష గతి మార్గానికి
విముక్తి దారిలో మసులుకోవాలి!

యుద్ధాలతో యోగులు కారు
యాగ బలాలతో యోగులవుతారు !

మట్టి మనసు
సుగంధ పరిమళాలు వెదజల్లుతుంది
ముష్టి యుద్ధాల
రుధిర దుర్వాసనలని భరించదు!

తెల్లారితే
కళ్ళు విప్పే పూలు
మన కళ్ళు అవ్వాలి !
పూల తేనెలుగా
మన కన్నీళ్లు మారాలి !
సతతం హరితాన్ని జీర్ణం చేసుకోవాలి !

– ఒబ్బిని సన్యాసిరావు



## అన్నీ నీవే



నీ కనులలో
కాంతి
రేఖలు
నా బతుకు
బాటకు
వెలుగు
రేఖలు
నీ నుదుటన తూరుపు సింధూరం
నా భవితకు జీవన ఆధారం
నీ దరహాసపు చిన్ని పెదాలు
నా భావ కవితకు చిరు పదాలు
నీ మురిపాల సొట్ట బుగ్గలు
నా మదిలో చిగురించే మల్లెమొగ్గలు
నీ చుబుకాన పుట్టుమచ్చలు
నా గుండెపై పచ్చబొట్లు
నీ దానిమ్మ గింజలపళ్ళు
నన్ను ఖైదు చేసిన సంకెళ్ళ

– కయ్యూరు బాలసుబ్రమణ్యం

## ఎండుటాకుల చప్పుడు

మాలగా అల్లబడిన
మనుషులలోకి
ఒక పువ్వుగా చేరుకోలేను.
గుమ్మంలోకి అడుగు పెట్టాలంటే
విరిగిపడిన ఎండుటాకుల
చప్పుడు
రంపాలుగా
కోస్తుందేమోనని
భయం.
గాలి చెట్లనే కాదు
మనుషులను కూడా
కుదిపేస్తుంది.
గుంపులో నుండి వేరు
చేసి
నా నీడల కింద నన్నే
మరణించమంటుంది.
నలుగురితో పాటు
నా చేతులను కదుక్కోలేని స్థితికి
కారణాలు వెతుక్కోవాలి.
అవకాశాల విహంగాలను
కూల్చేసుకొని
నుదుటిపై మేకులను
దించుకున్నాను.



ఇప్పుడు నేను
చీమల వరుస
నుండి
తప్పిపోయిన
అనాథను,
పగిలిపోయిన మేఘాన్ని,
రాత్రిని వీపుపై మోస్తున్న
గాయమైన శరచ్చంద్రికని.
పగిలిపోయిన అద్దాల్లో
మొన్నటి నిచ్చెన
ముక్కలు
ముక్కలుగా..
ఇప్పుడు
సరిదిద్దాల్సింది
అద్దాలను కాదు
ముక్కలైన నిచ్చెనను.

నీటిలోని ప్రతిబింబం
కాలానికి కొలమానం లాంటిదే.
కొద్దిసేపటి ముందు
ప్రతిబింబం సంపూర్ణం
ఇప్పుడు పాక్షికం
మరి రేపు?
అంతిమంగా;
రేపటి ఉదయాన్ని తొడుక్కోవాలి.

– జాని తక్కెడశిల

## కోయిలమ్మ స్వరంలో కొత్త రాగాలు

ఆకాశం నుండి
రాలుతున్న తారలు
తెగిపోయిన వీణ
తంత్రులు
అయినా కానీ
రాతి గర్భం నుండి
మొలుస్తున్న అంకురాలు
కోయిలమ్మ స్వరంలో
కొత్తరాగాలు
కొత్త గీతం
పాడుతున్నాను
......
కొత్త ఉషోదయం
తొలి వెలుగు రేఖలు
పృథ్వి అంతా
పరుచుకున్న
అరుణ రేఖలు
కొత్త గీతం
పాడుతున్నాను.

కరిగిపోయిన కలల
తాలుకు నిట్టూర్పు
ఎవరికి వినబడుతుంది
మనసులో దుఃఖం
కన్నీళ్ల రూపంలో
కళ్లనుండి రావడానికి



సిద్ధంగా ఉంది
ఓటమిని అంగీకరించను.

కాలం అనే కాగితంపై
రాస్తున్నాను
చెరిపేస్తున్నాను
కొత్త గీతం
పాడుతున్నాను.

– అరుణ డేనియల్

# ఘుమఘుమలాడే వంటకాలు

విందు-పసందు

## ఫ్రైడ్ ఇడ్లీ

**కావలసిన పదార్థాలు**

ఇడ్లీలు-నాలుగు; పల్లీలు, శనగపప్పు, మినపపప్పు, బియ్యం, ధనియాలు-ఒక టేబుల్ స్పూన్ చొప్పున; మిరియాలు-ఒక టీస్పూన్; కరివేపాకు-రెండు రెబ్బలు; ఎండుమిర్చి-నాలుగు; ఉప్పు-తగినంత; నూనె-వేయించడానికి సరిపడా; చాట్ మసాలా-పావు టీస్పూన్.



**తయారు చేసే విధానం**

ఇడ్లీలను పొడవాటి ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోయాలి. బాగా వేడయ్యాక ఇడ్లీ ముక్కలను రంగు మారే వరకు వేయించాలి. స్టవ్ మీద ప్యాన్ పెట్టి పల్లీలు, శనగపప్పు, ఎండు మిర్చి, బియ్యం, ధనియాలు, మిరియాలు, కరివేపాకు వేయించాలి. చల్లారిన తర్వాత అన్నిటినీ మిక్సీలో వేసి తగినంత ఉప్పు కలిపి మెత్తగా పొడి చేసుకోవాలి.

వేయించిన ఇడ్లీ ముక్కలను ఒక గిన్నెలో వేసి, పైనుంచి పప్పుల పొడి, చాట్ మసాలా వేసి కలిపితే ఫ్రైడ్ ఇడ్లీ సిద్ధం.

## ఎయిర్ ఫ్రైడ్ కోకోనట్ ష్రింప్

**కావలసిన పదార్థాలు**

మైదాపిండి-అర కప్పు; మిరియాల పొడి-ఒక టీస్పూన్; ఉప్పు-తగినంత; బ్రెడ్ పొడి-ఒక కప్పు; ఎండు కొబ్బరి తురుము-అర కప్పు; గుడ్లు-రెండు; పచ్చి రొయ్యలు-ఒక కప్పు; మయోనీజ్- అర కప్పు; స్పైసీ చిల్లీ సాస్-ఒక టేబుల్ స్పూన్; థాయ్ స్వీట్ చిల్లీ సాస్-ఒక టేబుల్ స్పూన్.



**తయారు చేసే విధానం**

ఒక పెద్ద గిన్నెలో మైదాపిండి, ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. మరో గిన్నెలో కొబ్బరి తురుము, బ్రెడ్ పొడి వేసి కలపాలి. మూడో గిన్నెలో గుడ్ల సొన వేయాలి. ఇప్పుడు శుభ్రం చేసుకున్న ఒక్కో రొయ్యను ముందుగా పిండి, తర్వాత కొబ్బరి మిశ్రమం, చివరగా గుడ్డు సొనలో ముంచి పక్కన పెట్టాలి.

వాటన్నిటినీ ఎయిర్ ఫ్రైయర్ బాస్కెట్‌లో పెట్టి, 400 డిగ్రీల దగ్గర సుమారు పదిహేను నిమిషాలు ఉడికించాలి. వీటికి మయోనీజ్, చిల్లీ సాస్ మిశ్రమం కలిపితే వేడి వేడి ఎయిర్ ఫ్రైడ్ కోకోనట్ ష్రింప్ రెడీ..

## చికెన్ ఆలూ కుర్మా

**కావలసిన పదార్థాలు:**

చికెన్-500 గ్రా; ఆలుగడ్డ-ఒకటి (పెద్దది); టమాట-ఒకటి; పచ్చిమిర్చి- నాలుగు; కరివేపాకు-రెండు రెబ్బలు; ఉల్లిగడ్డ-ఒకటి; అల్లం-వెల్లుల్లి పేస్ట్-ఒక టీస్పూన్; పసుపు-అర టీస్పూన్; ధనియాల పొడి కారం-ఒక టీస్పూన్ చొప్పున; నూనె-అరకప్పు; పచ్చికొబ్బరి తురుము-అరకప్పు; జీడిపప్పు-పది; తర్బూజ గింజలు, గసగసాలు-ఒక టేబుల్ స్పూన్ చొప్పున; కొత్తిమీర తురుము-కొద్దిగా; నిమ్మరసం-ఒక టీస్పూన్; గరం మసాలా-అర టీస్పూన్; ఉప్పు- తగినంత.



**తయారు చేసే విధానం**

ముందుగా పచ్చికొబ్బరి, జీడిపప్పు, గసగసాలు, తర్బూజ గింజలను మెత్తగా పేస్ట్ చేసి పెట్టుకోవాలి. ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి కూడా ముద్దగా చేసుకోవాలి. చికెన్‌ను బాగా కడిగి ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లలో గంట పాటు నానబెట్టాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. కరివేపాకు, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి పేస్ట్, పసుపు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేలా వేగాక తరిగిన టమాట ముక్కలు జోడించి మగ్గించాలి. కారం, ధనియాల పొడి, పచ్చికొబ్బరి మిశ్రమం, గరం మసాలా, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి రెండు కప్పుల నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తర్వాత తరిగిన ఆలుగడ్డ ముక్కలు, నానబెట్టిన చికెన్ వేసి మూత పెట్టి సన్నటి మంటపై అరగంట పాటు ఉడికించాలి. చివరగా కొత్తిమీర చల్లుకుని దించుకుంటే నోరూరించే చికెన్ ఆలూ కుర్మా రెడీ.

## జొన్న లడ్డు

**కావలసిన పదార్థాలు**

జొన్నపిండి-ఒక కప్పు; బెల్లం-అర కప్పు; పల్లీలు-అర కప్పు; నెయ్యి-పావు కప్పు; యాలకుల పొడి-అర టీస్పూన్.



**తయారు చేసే విధానం**

స్టౌ మీద ప్యాన్ పెట్టి పల్లీలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే ప్యాన్‌లో పావుకప్పు నెయ్యి వేసి, వేడయ్యాక జొన్నపిండి జోడించి పచ్చివాసన పోయేవరకు సన్నని మంటమీద వేయించాలి.

ఇప్పుడు ఒక మిక్సీ జార్ తీసుకుని వేయించిన పల్లీలు, జొన్నపిండి, బెల్లం వేసి మెత్తగా మిక్సీ పట్టి ఒక ప్లేట్లో తీసుకోవాలి. పిండి మిశ్రమంలో మిగతా నెయ్యి, యాలకుల పొడి వేసి బాగా కలిపి లడ్డూ ఆకారంలో చేసుకుంటే జొన్న లడ్డు రెడీ.

# పాతవాటికి కొత్త సొబగులు

పొద్దున్నే లేచిన దగ్గర నుండి రాత్రి పడుకోబోయే వరకు ప్లాస్టిక్ వస్తువులతో పని లేకుండా రోజు గడవదు.. అంటే అతిశయోక్తి కాదు. తరచుగా గాజు వస్తువులను సైతం ఉపయోగిస్తుంటాం. వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ డబ్బాలు మొదలైన వాటిని వాడిన తరువాత బయట పారేస్తుంటాం. ఆ విధంగా ఎక్కడంటే అక్కడ పడేయకుండా వాటిని రీసైకిల్ చేయవచ్చు. ఇలాంటి వ్యర్థాలతో ఏమేం తయారు చేస్తున్నారో చూద్దాం.

## వాడిన దుస్తులు



మన దేశంలో పాత దుస్తులను విరాళంగా ఇస్తుంటారు చాలామంది. చిరిగిపోయిన వాటిని పారేస్తుంటాం. అలాంటి దుస్తుల నుంచి ఫైబర్‌ను సేకరించి బ్లాంకెట్స్, డోర్‌మ్యాట్స్, ఫర్నిచర్స్, బ్యాగ్స్ మొదలైన వస్తువులు తయారు చేస్తున్నారు.

## గ్లాస్

గ్లాస్ బాటిల్స్‌ను సైతం రీసైకిల్ చేయొచ్చు. వాటితో మళ్లీ కొత్త గ్లాస్ బాటిల్స్, ఫైబర్ గ్లాస్, ఇంటి నిర్మాణానికి ఉపయోగపడే మెటీరియల్స్‌ను తయారు చేస్తున్నారు. సక్రియేటివ్ డిజైన్ వర్క్స్‌లోనూ వాడుతున్నారు.

## పేపర్స్

కొన్ని రకాల రసాయనాలు ఉపయోగించి పేపర్లపై ఉండే ఇంకును తొలగిస్తారు. ఆ తరువాత నీళ్లు, మరికొన్ని రసాయనాలు కలిపి ముద్దగా చేస్తారు. వాటితో కప్‌బోర్డులు, బ్యాగులు, గిఫ్ట్ కవర్స్, ఆఫీస్ పేపర్స్ లాంటివి తయారు చేస్తారు.

## టెట్రా ప్యాక్స్

పాలు, జ్యూస్ ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు టెట్రా ప్యాకెట్స్‌లో విక్రయిస్తుంటారు. జ్యూస్ తాగి వాటిని పడేస్తుంటాం. వాటిని సేకరించి పేపర్స్, రూఫింగ్ షీట్స్, బెంచ్, డెస్క్ వంటి ఫర్నిచర్స్ తయారు చేస్తారు.

## ఈ-వేస్ట్

పాత మొబైల్ ఫోన్స్, చార్జర్స్, విరిగిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉండే లోహాలను కరిగించి, వాటి నుంచి బంగారం, వెండి, రాగి, పెల్లాడియం వంటి రసాయన మూలకాలను వెలికి తీస్తారు. వాటిని కొత్త ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వినియోగిస్తారు.

## ప్లాస్టిక్ బాటిల్స్

తాగి పడేస్తే ప్లాస్టిక్ బాటిల్స్‌తో తిరిగి కొత్త ప్లాస్టిక్ బాటిల్స్ తయారు చేస్తారు. దీని ద్వారా కొత్త వాటి అవసరం తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే పాలిస్టర్ ఫైబర్‌గా మారుస్తారు. ఈ ఫైబర్‌ను దుస్తులు, పిల్లో, కుషన్స్, బొమ్మల తయారు చేసే ప్రక్రియలో వినియోగిస్తారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్‌గానూ మార్చవచ్చని



తెలుస్తోంది.

టూత్‌పేస్ట్, షాంపూ, పౌడర్ బాటిల్స్ అయిపోగానే వాటిని బయట పడేస్తుంటాం. అలాంటి ప్లాస్టిక్ వస్తువులతో తిరిగి కొత్త బాటిల్స్ తయారు చేస్తారు. ఇంట్లో ఉపయోగపడే ప్లాస్టిక్ వస్తువులు, ప్యాకింగ్‌కు ఉపయోగపడే మెటీరియల్స్‌గా తయారు చేస్తారు.

## నూనె

ఒకసారి వాడిన నూనెను మళ్లీ వాడకూడదని చాలా మంది అంటుంటారు. ఇంట్లో అయితే తక్కువ మొత్తాన్ని పారేస్తుంటాం. కానీ కొన్ని సంస్థలు, రెస్టారెంట్లు, ఇతర ఫ్యాక్టరీల్లో వాడి పక్కన పెట్టిన నూనెను సేకరించి దీనితో బయోడీజిల్ తయారు చేస్తున్నాయి. దీని ద్వారా ఇంధన కొరతను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు.

## సిగరెట్ పీకలు

సిగరెట్లు తాగి వాటి పీకలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుంటారు చాలా మంది. వాటిని సేకరించి కుషన్లు, బొమ్మలు, కీ చైన్లు మొదలైనవి తయారు చేస్తున్నాయి కొన్ని రీసైక్లింగ్ కంపెనీలు. భారత్‌లోని ఓ సంస్థ అయితే ఏకంగా వాటిని సేకరించేందుకు దేశవ్యాప్తంగా పలు పాన్/కిరాణా షాపుల వద్ద ప్రత్యేకంగా డబ్బాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.



# నొప్పింపక.. తానొవ్వక..

సింగిల్ పేజీ కథ

ఆర్.సి.కృష్ణస్వామి

**“భర్త లేకున్నా భార్య ఎక్కువ కాలం బతుకుతుంది” అనే వ్యాసాన్ని సీరియస్‌గా చదువుతూ ఉన్నాడు నందగిరి. సర్వీసు చేసి చేసి టైర్డ్ అయ్యాడని రిటైర్ చేశారు బ్యాంకువారు మేనేజర్ నందగిరిని.**

పిల్లల చదువుల కోసం ఫ్యామిలీని తిరుపతిలోనే పెట్టి దక్షిణ రాష్ట్రాలన్నీ తిరిగి వచ్చాడు.

మొగుడి చేత ఏదో ఒక పని చేయించాలనుకుంది నందగిరి భార్య చతురిక. సాన పెట్టకపోతే కత్తి పీట అయినా తుప్పు పడుతుందని గుర్తుకొచ్చింది చతురికకు.

చిన్నగా వచ్చి “ఏమండీ! ఈరోజు టిఫన్‌కి ఘుమఘుమలాడే నెయ్యి వేసి పెసలపప్పు పొంగలి చేసుకుందాం. ఇంట్లో పెసలపప్పు ఎక్కువ లేదు. పక్క వీధిలో సుగుణక్క అంగడి ఉంది. వెళ్లి కేజీ పప్పు తీసుకుని రండి” అని నెమ్మదిగా చెప్పింది.

లుంగీ ఎగగట్టి చిన్నగా లేచి నిలబడ్డాడు నందగిరి. అద్దం ముందర నిలబడి మీసాలు దువ్వుతూ ఉంటే గుర్తుకొచ్చింది రిటైర్డ్ సీనియర్ మేనేజర్ మాటలు.. “పెన్షనర్ అంటే ఇంట్లో వాళ్లందరికీ లోకువే. కొంచెం వంగితే పనిమనిషిని మాన్పించి వంట పాత్రలు కూడా మన చేత కడిగిస్తారు” అని.

బ్యాగు చేతికి తీసుకుని ఊగుతూ ఊగుతూ బయలుదేరాడు. సుగుణక్క అంగడికి వెళ్లి పెసలు పట్టుకొచ్చాడు.

గ్యాసు స్టవ్ మీద వంటకి కావలసినవి అన్నీ సిద్ధం చేసుకుని మొగుడి కోసం చూస్తూ ఎదురు చూస్తూ ఉంది చతురిక. మొగుడు తెచ్చిన పెసలు చూసి ముక్కు మీద వేలు వేసుకుంది.

“బ్యాంకు శాఖలను ఏలినామంటారు. పెద్ద పెద్ద కష్టమర్లను బుట్టలో పడేసినామని గొప్పలు చెబుతారు. కోట్ల రూపాయలు డిపాజిట్లు సేకరించామని శాలువాలు కప్పించుకుంటారు. అట్లాంటిది పెసలపప్పు తెమ్మంటే ముడిపెసలు తెచ్చారేమిటండీ?” అని మెత్తమెత్తగా అడిగింది.

అమాయకంగా ముఖం పెట్టాడు



నందగిరి.

“అరవై యేళ్ళు పైబడినా ఏమీ తెలియదు ఈయనకు. నేను బతికినంత కాలం ఫర్లేదు. నేను పోయాక ఎలా బతకబోతాడో ఈ పిచ్చిమారాజు” అనుకుని ఇంట్లో ఉన్న కాసింత పెసలపప్పుతో పొంగలి చేసింది.

సెగలు గక్కే పొంగలిలోని మిరియాలు పక్కన పెట్టి, జీడిపప్పు ముక్కలను జోరుజోరుగా తిన్నాడు నందగిరి. నెయ్యితో పాటు ఉడికిన లేత కరివేపాకు ఆకుల్ని ఏరిఏరి కొరికాడు.

సాయంత్రం ఆరు గంటలయ్యింది. భార్యాభర్తలు రెండేసి ఉప్పు బిస్కెట్లు తిన్నారు. వేడి వేడి ఫిల్టర్ కాఫీ తాగారు. ఆరోగ్యానికి మంచిదని ఇద్దరూ ఈవెనింగ్ వాక్‌కి పార్కుకు బయలుదేరారు. పోతూ పోతూ పక్క వీధిలోని సుగుణక్క అంగడి దగ్గర ఆగింది చతురిక.

తేలు కుట్టిన దొంగలాగా దూరంగా కానుగచెట్టు కింద నిలబడి దిక్కులు చూడసాగాడు నందగిరి.

కోపంగా వెళ్లిన చతురిక “ఏమి సుగుణా! మా ఇంటాయనకంటే పెసలపప్పుకీ, ముడి పెసలకీ తేడా తెలియదు. నువ్వు ఇరవై నాలుగ్గంటలూ సరుకులు అమ్మేదానవు. అన్నీ తెలిసి కూడా మా ఇంటాయనకు ఇవి ఇచ్చావే! ఇన్ని ముడి పెసలు మేమేం చేసుకుంటాం. మాకు పెసలుతో చేసే పెసరట్టు కూడా అలవాటు లేదు. మా ఆయన పేపర్ల పని చేసాడే కానీ పెసలు చూసినోడు కాదు” అని నిష్ఠూర పడింది.

ఏదో చెప్పాలనుకుంది సుగుణక్క. మొగుడూ పెళ్లాలిద్దరూ మేడ్ ఫార్ ఈచ్ అదర్‌లా ఉన్నారు. వారి ఆనందం ఎందుకు పాడు చేసేదని తన నోటికి తానే తాళం వేసుకుంది సుగుణక్క.

మారు మాట్లాడకుండా ముడిపెసలు తీసుకుని పెసలపప్పు పొట్లం చతురిక చేతికి ఇచ్చింది.

ఇద్దరూ అక్కడి నుంచి నవ్వుతూ కదిలారు. తెల్లారి పెసలపప్పు ఇవ్వబోయినా ముడిపెసలు తీసుకెళ్ళిన నందగిరి వైపు చూసింది. ఏమీ తెలియనోడిలాగా ఎగిరెగిరి నడుస్తూ ఉన్నాడు.

“రిటైర్ అయిన ఆరు నెలలు పెళ్లాం చెప్పింది రివర్స్‌లో చేస్తే మనకి పనులెవ్వరూ చెప్పరు. గృహం స్వర్గసీమ అవుతుంది, లేకుంటే కారాగార జీవితం అవుతుంది” అని సీనియర్లు చెప్పింది గుర్తుకు తెచ్చుకున్న నందగిరి జోకులేస్తూ హుషారుగా నడుస్తున్నాడు.

“మా ఇంటాయన పెద్ద పెద్ద కొలువులు చేశాడు కానీ... ప్రతిదానికీ నా మీద ఆధారపడతాడు” అని గర్వంగా ముఖం పెట్టి మొగుడి జోకులకు పడీ పడీ నవ్వుతోంది చతురిక.

# కాకి సలహా

ఒక అడవిలో ఒక చెట్టుపై ఉడత నివసించేది. ఉడత ఆహారం సేకరించి, కొంత తినేది, మిగిలింది చెట్టు దిగువ దాచేది.

ఉడత ఆహారం దాయటం ఒక కుందేలు గమనించి ఉడత దాచుకున్న ఆహారం తినేసేది.

ఉడత తాను దాచిన ఆహారం కోసం వెతికితే అక్కడ ఉండేది కాదు. చెట్టుపై నివాసం ఉండే కాకితో.. ఉడత తాను దాచిన ఆహారం ఎవరో దొంగతనం చేస్తున్నారని చెప్పింది.




ఉడత దాచిన ఆహారం కుందేలు తినడం కాకి చూసింది. ఉడతతో ఆ విషయం చెప్పింది. అలాగే ఉడతతో "కుందేలును మనమేం చేయలేం. నీవు ఇక నుండి ఆహారం దాచుకునే చోటు మార్చు" అని చెప్పింది.

ఉడత ఆహారం దాచుకునే చోటు మార్చినా కుందేలు వెతికి వెతికి కనుక్కొని ఆహారాన్ని తినేసేది. ఉడత ఆ సంగతి మళ్లీ కాకితో చెబితే కాకి "నువ్వు సేకరించి దాచే ఆహారానికి అలవాటు పడిపోయింది. సొంతంగా ఆహార సేకరణ చేయడానికి వెళ్లడం మానేసింది. ఇతరుల ఆహారంపై ఆధారపడి సోమరిగా జీవిస్తున్నది. అందుకే దాని బుద్ధి మారేటట్లు చేయాలి. నీవు కుందేలులో మార్పు రావడానికి ఇకపై ఆహారాన్ని దాయటం మానేయ్. కేవలం నీకు ఆ రోజుకి సరిపోయినంత ఆహారమే సేకరించు. నువ్వు దాచే ఆహారం కోసం కుందేలు వెతికి వెతికి ఆహారం దొరక్కపోతే, తన ఆకలి తీర్చుకోవడానికి తానే బయటకు వెళుతుంది. ఇక్కడ నువ్వు ఆహారం దాయటం లేదని అర్థం చేసుకొని ఇటు వైపు రావటం మానేస్తుంది. బద్ధకం వీడి తన ఆహారం తానే సొంతంగా సేకరించుకుంటుంది. అటు తర్వాత నువ్వు కొంత ఆహారాన్ని దాచినా దొంగతనం సమస్య ఉండదు" అని సలహా ఇచ్చింది. కాకి సలహా ఉడత పాటించింది. ఉడత ఆహారం దాయడం మానేసింది. కుందేలుకు ఉడత దాచిన ఆహారం కోసం రోజు వెతికేది. ఆహారం లభించక పోవడంతో, తన ఆకలి తీర్చుకోవడానికి ఆహార సేకరణ స్వయంగా చేసుకోవడం మొదలు పెట్టింది.

కొన్ని రోజులకు కుందేలు ఆ చెట్టు దగ్గరకు రావటం మానేసింది. కాకి సలహా విజయవంతం అవడంతో కాకికి ఉడత కృతజ్ఞతలు చెప్పుకుంది.

- మొర్రి గోపి,
శ్రీకాకుళం

## బయటకు దారి కనిపెట్టండి





వార్త ఆదివారం

## బాలగేయం

# చల్లని మనసు

అల్లీ బిల్లీ పాపాయి..
మల్లెమొగ్గే నీవోయి..
కల్లాకపటం లేదోయి..
చల్లని మదియే నీదోయి..
........
వెన్నెల నవ్వే నీవోయి..
తేనెల జల్లై రావోయి..
పున్నమి జాబిలి నీవోయి..
సన్నజాజి నవ్వు నీదోయి.
......
తెలుగు యింటి
ముద్దబంతోయి..
వెలుగు కంటిపొద్దు
పొడుపోయి..
కలువకళ్ల సొగసు
నీవోయి..
చలువరాతి మనసు
నీదోయి.

**- జి.నరేంద్ర బాబు**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

ప్రసాద్, అనంతపురం

ప్రశ్న: నెమలి పురి విప్పి నాట్యం చేయడానికి కారణమేమిటి?

జవాబు: మన దేశపు జాతీయ పక్షి నెమలి. మగ నెమలి తనకు జతకూడే సమయం వచ్చినప్పుడు రంగురంగుల పింఛాల్ని పురివిప్పి నాట్యం చేస్తుంది. ఆడ నెమళ్లను ఆకర్షిస్తుంది. ఆడనెమలి దరి చేరగానే పృష్ట భాగాన్ని చూపిస్తుంది. ఇలా ఎందుకు చేస్తుందో ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోయారు.
వర్షం కురిసినప్పుడు నెమళ్లు ఆనందంతో పరవశంతో, నాట్యం చేస్తాయన్నది నానుడి. నెమలి ఫెసియనైడ్ జాతికి చెందిన పక్షి. మగ నెమలిని 'పీకాక్' ఆడ నెమలిని 'పియాన్' అని అంటారు. మన దేశంలోని నెమళ్లు నీలం రంగులో వుంటాయి. ఆగ్నేయాసియాలో ఆకుపచ్చ వర్ణంలో వుంటాయి.

మగనెమలికి తోక నిండా రంగు రంగుల పింఛాలుంటాయి. నాట్యం చేస్తున్నప్పుడు తోకను పైకెత్తుతుంది. అప్పుడది బాగా విచ్చుకొని శరీరానికి నలువైపులా పరుచుకొని ముందుకు పొడుచుకు వస్తుంది. నాట్యంలో నెమలి గెంతుతూ గుండ్రంగా తిరుగుతుంది. రకరకాల శబ్దాలు చేస్తుంది. ఒకోసారి పెద్దగా అరుస్తుంది కూడా.

డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రభుత్వం 1990లో ఎంతో అందమైన నెమలి పురివిప్పిన దృశ్యాన్ని పోస్టల్ స్టాంప్‌గా విడుదల చేసింది. మన భారతీయ నెమలినే ఈ స్టాంపు ప్రతిబింబింపచేసింది.

– సుహాసిని, గన్నవరం

ప్రశ్న: లోహం వ్యాకోచిస్తుంది.. అనడానికి ఉదాహరణ?

జవాబు: వేడికి లోహం వ్యాకోచిస్తుంది కాబట్టి, ఈఫిల్ టవర్ ఎప్పుడూ సూర్యుడికి వ్యతిరేక దిశ వైపు కొంచెం ఒరుగుతుంది.





# ఇమ్యూనిటీని పెంచే దబ్బపండు

దబ్బపండు సిట్రస్ జాతికి చెందిన మొక్క. ఇవి శరీరంలో అధికంగా గల వాత దోషాలను పోగొడుతుంది. ఇందులో విటమిన్ 'డి' ఎక్కువగా ఉంటుంది. ఇది బయో ఫ్లేవనాయిడ్స్ అధికంగా కలిగి ఉంటుంది. దబ్బపండు రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటే శరీరంలోని వేడిని తగ్గిస్తుంది.

100 గ్రాముల దబ్బకాయ గుజ్జులో 42 కేలరీలు మాత్రమే ఉంటాయి. కానీ పీచు శాతం మాత్రం చాలా ఎక్కువ. ఈ పీచు కేన్సర్‌కు కారణమైన రసాయనాల్ని పీల్చేస్తుంది. ఇంకా కొలెస్ట్రాల్ తగ్గేందుకు సైతం సహకరిస్తుంది.

దబ్బపండులో 100 గ్రా. తాజా పండులో 135 మి.గ్రా. పొటాషియం ఉంటుంది. దబ్బపండుని 'మాతులుంగ', 'బీజపూర' అని పిలుస్తారు. 'సిట్రస్ మెడికా' వృక్షనామం. మందపాటి తోలు, లోపల చిన్నపాటి తొనలూ ఉంటాయి. దీని తోలు, గింజలు, తొనలు వైద్యానికి పనికొస్తాయి. పేగుల్లో వచ్చే వ్యాధుల్లో దీని ప్రయోగం ఎక్కువ. మొలల వ్యాధిలో ఇది ప్రముఖమైన ఔషధం కూడా.

ఐరోపా, అమెరికా దేశాల్లో దొరికేవి మాత్రం అక్కడి నారింజ అంటే కమలాపండ్ల మాదిరిగానే పులుపుతో కూడిన తియ్యని రుచితో ఎరుపు, గులాబీరంగు గుజ్జుతో ఉంటాయి. తియ్యని నారింజతో పోలిస్తే గ్రేప్ ఫ్రూట్ రుచే వేరు.. అంటుంటారు అక్కడివాళ్లు. గుజ్జు రంగుల్లో తేడా ఉన్నప్పటికీ తొక్క రంగు మాత్రం ఎక్కువగా పసుపు రంగులోనే ఉంటుంది. నిజానికి నారింజ, నిమ్మ, పంపర పనసల్లోని గుణాలన్నింటినీ పుణికి పుచ్చుకున్నదే దబ్బపండు. ఇది కొన్ని రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

## వ్యాధి నిరోధకంగా..

దబ్బపండులో ఇమ్యూనిటీని పెంచే పోషకాలున్నాయి. నిమ్మ, నారింజ, పంపరపనస పండ్లలో ఉండే అన్ని గుణాలూ ఈ ఒక్క పండులోనే పుష్కలంగా ఉన్నాయి.

దబ్బకాయ షర్బత్ తాగితే వాంతులు, దప్పిక, నోటిపూత, చిగుళ్ల వాపులు తగ్గిపోతాయి. దబ్బకాయ మెటబాలిజం మీద ప్రభావం చూపుతుంది. ఫలితంగా బరువు తగ్గుతారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు చాలా ఎక్కువ. చాలామంది మహిళలకు, ముఖ్యంగా పిల్లలకి కడుపులో నులి పురుగులు చేరి ఇబ్బంది పెడతాయి. అలాంటప్పుడు దబ్బపండు రసంలో వాము, జీలకర్ర కలిపి తీసుకుంటే మేలు. ఈ పండును రోజూ తింటే జుట్టు బాగా పెరిగి, జుట్టు రాలే సమస్య నియంత్రణలోకి వస్తుంది. త్వరగా తెల్లజుట్టు రాకుండా ఆపుతుంది.



దబ్బకాయ రసాన్ని రోజూ తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దీనివల్ల జలుబు, ఫ్లూ జ్వరాలు, దగ్గు వంటి వ్యాధులు దరిచేరవు.

ఎరుపురంగులో ఉండే గ్రేప్ ఫ్రూట్‌లో లైకోపిన్ ఉండటంవల్ల ఇది చర్మాన్ని అతినీల లోహిత కిరణాల నుంచి కాపాడటంతో పాటు ప్రొస్టేట్ కేన్సర్ నుంచీ రక్షిస్తుంది. ఇతర కెరోటినాయిడ్లతో పోలిస్తే కేన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి లైకోపీన్‌కే ఎక్కువ.

100 గ్రా. తాజా దబ్బపండులో 135 మి.గ్రా. పొటాషియం ఉంటుంది. గుండె వేగాన్ని నియంత్రించేందుకూ, రక్తపోటు అదుపుకూ ఇది ఎంతో ఉపయోగం. కండరాలు శుష్కించిపోయే వ్యాధిలో ఇది ఉపయోగపడుతుంది. దబ్బపండు రసంతో తయారయ్యే ఆయుర్వేద ఔషధాలలో మాదీఫల రసాయనం, ధాత్రీ రసాయనం ముఖ్యమైనవి. గర్భవతుల్లో కలిగే వాంతులు, వికారాలను ఇది తగ్గిస్తుంది.

పేగులకు ఇది టానిక్‌లా పని చేస్తుంది. ఇమ్యూనిటీ బూస్టర్ కూడా పని చేస్తుంది. బస్సు ప్రయాణం పడనివారికి వాంతులవుతుంటాయి. అలాంటి వారికి ప్రయాణాల్లో వాంతులు వచ్చే ఇబ్బందిని తగ్గిస్తుంది. దబ్బకాయలో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్ ఉండటం వల్ల ఉండటం వల్ల జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది.

మలబద్ధకాన్ని నివారిస్తుంది. దబ్బకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కొన్ని రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దబ్బకాయలో విటమిన్ 'ఎ' ఉంటుంది, ఇది కంటి చూపును మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. దబ్బ కాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు

చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మూడొంతుల వేడినీళ్లలో ఒక వంతు వెనిగర్‌నీ, ఒక వంతు దబ్బపండు రసాన్నీ కలిపితే చాలు, బాత్‌రూమ్ టబ్‌లూ సింక్‌లూ, కిచెన్ టైల్సూ అన్నీ శుభ్రం చేసుకోవచ్చు.

ఇది సహజమైన క్లీన్సర్ కూడా. దీని గుజ్జుని చర్మం మీద నెమ్మదిగా రుద్దితే మృతకణాలన్నీ తొలగి నిగారింపుని తీసుకొస్తుంది. ఖరీదైన క్లీన్సర్లూ ఫేస్‌క్రీముల్ని గమనిస్తే వాటిల్లో ఆల్ఫా హైడ్రాక్సీ ఆమ్లాలు ఉంటాయి.

అవన్నీ సహజంగానే ఈ దబ్బపండులో ఉంటాయి. లిమోనాయిడ్లూ గ్లూకారేట్లూ కూడా ఇందులో ఎక్కువ. ఇవి రొమ్ముకేన్సర్లూ, ట్యూమర్లూ రాకుండా కాపాడతాయి.



ఇందులో విటమిన్ 'ఎ' సమృద్ధిగా దొరుకుతుంది. ముఖ్యంగా ఇందులో ఉండే నారింజనిన్, నారింజిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఊపిరితిత్తుల కేన్సర్, నోటి కేన్సర్లు రాకుండా కాపాడతాయి. వీటితోపాటు, లైకోపిన్, బీటా కెరోటిన్, క్సాంథిన్, ల్యూటిన్ వంటి ఫ్లేవొనాయిడ్‌లూ ఎక్కువే. అందుకే దీన్ని క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల కంటిచూపు మెరుగు పడుతుంది.

ఈ పండులో కాల్షియం, ఐరన్, కాపర్, ఫాస్పరస్ వంటి ఖనిజాలతోపాటు కొద్దిపాళ్లలో బికాంప్లెక్స్ విటమిన్లు సైతం ఉంటాయి. ఇది ఊబకాయాన్ని నివారించేందుకు దోహదపడుతుందని పరిశోధకులు నిర్ధారించారు. దబ్బపండును వానాకాలంలో సైంధవ లవణంతో, వసంత కాలంలో పంచదారతో, చలికాలంలో ఉప్పు, అల్లం, ఇంగువతో, వేసవి కాలంలో బెల్లంతో కలిపి తీసుకుంటే ఆరోగ్యమని పెద్దలంటారు.

దబ్బ పండును ఒక కూరగాయ/ ఊరగాయగా కూడా వాడుకోవచ్చు. దబ్బకాయ రసంతో చేసే పులిహోర ఎంతో రుచికరంగా ఉంటుంది.

**- చాగంటి సౌజన్య**

# బేబీ స్లీప్ మెషిన్

**ఉయ్యాల్లో** ఊపుతూ లాలిపాటలు పాడుతూ కథలు చెబుతూ ఇలా చిన్నారులను నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. ఇప్పుడు ఆ పనిని సులభతరం చేసింది జియానా లులుమ్ సూథర్. ఇదొక ఆల్ ఇన్ వన్ స్లీప్ మెషిన్.



ప్రత్యేకమైన ఆహ్లాదకరమైన పాటలు, శబ్దాలను ప్లే చేస్తూ చిన్నారులను త్వరగా నిద్రపుచ్చడానికి ఉపయోగపడుతుంది మెషిన్. అంతేకాదు.. ఇందులోని క్రై డిటెక్షన్ టెక్నాలజీ, చిన్నారుల ఏడుపు విన్న ఇరవై సెకన్లలోపే తల్లిదండ్రులకు నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు, ప్రశాంతమైన శబ్దాలను ప్లే చేస్తుంది. తర్వాత రెడ్‌లైట్ థెరపీలో భాగంగా డివైజ్ లైట్లను అడ్జస్ట్ చేస్తూ, పిల్లలను కామ్ చేయటానికి ప్రయత్నిస్తుంది. దీనిని మొబైల్‌కు ఓ యాప్ ద్వారా కనెక్ట్ చేసుకుని వాడుకోవచ్చు. ఇందులోని స్మార్ట్ ఇన్‌ఫాంట్ మానిటరింగ్ సహాయంతో ఎక్కడి నుంచి అయినా ఈ డివైజ్‌ను ఆపరేట్ చేసుకోవచ్చు. టైమర్, నోటిఫికేషన్, ఇతర సెట్టింగ్స్ అన్ని కూడా యాప్‌లోనే సెట్ చేసుకోవచ్చు. చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు.

# నిమిషాల్లో ఐస్‌క్యూబ్స్

రిఫ్రిజిరేటర్‌లో ఐస్ క్యూబ్స్ తయారుచేసుకోవడానికి చాలా సమయం పడుతుంది. ఇకపై ఐస్‌క్యూబ్స్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరంలేదు. బ్రౌజ్ ఆర్‌వి - సిఆర్ఎక్స్ 2 అనే పోర్టబుల్ ఫ్రిజ్‌లో ఐస్‌క్యూబ్స్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరంలేదు. బ్రౌజ్ ఆర్‌వి సిఆర్ఎక్స్ 2 అనే పోర్టబుల్ ఫ్రిజ్‌లో ఐస్‌క్యూబ్స్ నిమిషాల్లోపే తయారవుతాయి. పెద్ద సూట్‌కేస్ సైజులో ఉండే ఈ ఫ్రిజ్‌ను ఎక్కడికైనా సులువుగా తీసుకుపోవచ్చు. ఎక్కడికంటే ఎక్కడికి తీసుకుపోయేందులు వీలుగా వీల్స్ కూడా ఉంటాయి. ఇందులోని ట్రేలో నీళ్ల నింపిపెడితే కేవలం పదిహేను నిమిషాల్లోనే ఐస్ తయారవుతుంది. పాలు, కూల్‌డ్రింక్స్, కూరగాయలు, పండ్లు వంటివి భద్రపరుచుకునేందుకు కూడా చోటు ఉంది. ఇది బ్యాటరీతో పనిచేస్తుంది. ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే రోజంతా పని చేస్తుంది. మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇందులోని ఉష్ణోగ్రతను కావాల్సిన రీతిలో నియంత్రించుకునే వెసులుబాటు కూడా ఉంది.




# స్మార్ట్ లాక్

తాళం చెవి మర్చిపోతే కొన్ని సార్లు తాళాన్ని పగులగొడుతుంటాం. ఈ సమస్యను దూరం చేయడానికి వివిధ ఫింగర్ ప్రింట్ లాక్స్ మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. బెంజిలాక్ సంస్థ రూపొందించిన ఈ ఔట్ డోర్ ఫింగర్ ప్రింట్ ప్యాడ్‌లాక్, ఐపి68 రేటెడ్ ప్రొటెక్షన్‌తో తయారుచేశారు. ఇది తాళాలకు దుమ్ము, ధూళి, తేమల నుండి రక్షణ కలిస్తుంది. అంతేగాక పదిమంది వేలిముద్రలు ఇందులో సేవ్ చేసుకోవచ్చు. చూడటానికి సాధారణ తాళం మాదిరే కనిపిస్తుంది. ఇందులోని లాక్ సిస్టమ్ వేలి ముద్రలతో లాక్‌ని తెరుస్తుంది.

తాళం చెవి లేకున్నా వేలి ముద్రలతో తాళాన్ని తీయవచ్చు. యూఎస్‌బి కేబుల్ ద్వారా చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు.

కథ

# ప్రేమ సంకెల

**శ్రీపతి లలిత**

**“అమ్మా! సుజాతా ఆంటీని ఆసుపత్రిలో చేర్చారట”.**

**అమ్మాయి ప్రియాంక ఫోన్లో చెప్తే “అయ్యో! మొన్న నేను బెంగళూరు వచ్చే ముందు చూసి వచ్చాను. అప్పుడు బాగానే ఉంది, కొడుకు గురించిన సమస్యలంటే ఎప్పుడూ ఉండేవే.. ఇంతకీ ఏమైంది?” బాధగా అంది శశి.**

“తల్లీ, కొడుకు గొడవపడి సతీష్ ఆవిడని గట్టిగా తోసేశాడట, కింద పడిన ఆంటీ తలకి దెబ్బ తగిలింది. పక్షవాతం వచ్చిందిట, కాలు, చెయ్యి, నోరు అన్నీ ఎఫెక్ట్ అయ్యాయట, ఆసుపత్రిలో ఉంది, బతకడం కష్టమే అంటున్నారు” తల్లితో అంది ప్రియాంక.

“ఇదేం కర్మ? మరీ అంత దెబ్బ తగిలేట్లు తోసేస్తారా? ఇరవై నాలుగు గంటలు ఆ సతీష్ తాగిన మత్తులో ఉంటాడు, ఈవిడేమో కొడుకుని వదిలేసి కూతురు దగ్గరకి వెళ్లదు” అన్న శశితో–

“ఆంటీ! మమ్మీ ట్రాప్ అనే మంకీ ట్రాప్‌లో ఇరుక్కుపోయింది అమ్మా, ఆవిడ జీవితం అంతే. బతికినా చచ్చినా ఆ సతీష్ దగ్గరే. సరేలే! నాన్న వెళ్లిపోదామని గొడవ చెయ్యడంలేదుగా! అన్నయ్య, వదిన, నేహా ఎలా ఉన్నారు? తెలివిగా మీకు అక్కడ బావుందా? ఇబ్బంది లేదుగా?” అనకుండా కుశలం అడిగిన కూతుర్ని చూసి నవ్వుకుంది శశి.

రాత్రి పడుకున్నాక శశికి సుజాత గుర్తు వచ్చి నిద్రపట్టలేదు.

మళ్లీ హైదరాబాద్ వెళదామా? అంటే వచ్చి పది రోజులు కాలేదు. కొడుకు వంశీ, కోడలు ఆరతి, ముఖ్యంగా మనవరాలు నేహా ఆరు నెలల నుంచి బతిమిలాడితే బెంగళూరుకి ఇప్పుడు వచ్చారు. అప్పుడే తిరుగు ప్రయాణం అంటే వాళ్లకి కోపం కన్నా బాధ కలుగుతుంది. రేపు సుజాత కోడలు అమృతకి ఫోన్ చెయ్యాలి.. అనుకుంటూ పడుకున్న శశికి పాత సంగతులన్నీ నిన్నగాక, మొన్న జరిగినట్టు గుర్తొచ్చాయి.

శశి భర్త మధు, సుజాత భర్త రంగనాథ్ ఇద్దరూ ఒకే వయసువాళ్లు. ఒకటే కంపెనీలో పనిచేసేవారు.

కంపెనీవారి హౌసింగ్ సొసైటీలో ఇద్దరూ స్థలం కోసం డబ్బు కడితే పక్క పక్కన అలాట్ ప్లాట్‌లు అయ్యాయి.

రంగనాథ్‌కి అప్పటికే పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు. అమ్మాయి స్వాతికి మూడేళ్లు. అబ్బాయి సతీష్‌కి మూడు నెలలు. తల్లితండ్రులకి ఒక్కడే కొడుకు అవడంతో ఊళ్లో ఆస్తి అమ్మి, స్థలం రిజిస్టర్ అయిన వెంటనే ఇల్లు మొదలుపెట్టి ఆరు నెలల్లో కిందా పైన పెద్ద ఇల్లు కట్టాడు. కింద విశాలంగా తమకి సరిపోయేంత, పైన రెండు వాటాలుగా అద్దెకివ్వడానికి.

స్థలం కొన్నాక మధుకి పెళ్లి అయ్యింది.

శశి ప్రభుత్వోద్యోగం చేస్తోంది.


పెళ్లవగానే అప్పు తీసుకుని ఇల్లు కట్టారు. ఇంటి ముందు మొక్కలకి ఖాళీ వదిలి, వీళ్ల వరకు సరిపడా పొందిగ్గా రెండు బెడ్ రూముల ఇల్లు కట్టుకున్నారు.

మొదట్లో రంగనాథ్, మధుతో బాగా స్నేహంగా ఉన్నా, ధనిక కుటుంబం నుంచి వచ్చిన సుజాత శశితో అంత కలిసేది కాదు. రానురాను శశి మనస్తత్వం నచ్చి సుజాత కూడా బాగా కలిసిపోయింది.

శశి, మధుల పిల్లలు పెద్దది ప్రియాంక, చిన్నవాడు వంశీ. ఇద్దరూ స్వాతి, సతీష్‌ల కంటే నాలుగైదేళ్లు చిన్న. మొదట్లో అన్న, అక్క అంటూ ఆడేవారు. కొద్దిగా పెద్దయ్యాక ఎవరి స్నేహితులు వాళ్లకి ఉండి “హలో అంటే హలో” అనుకునేవారు.

స్వాతి, సతీష్ ఇద్దరికీ తల్లి గారంతో డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెట్టడం అలవాటు అయ్యింది. సుజాత అది గొప్పగా అనుకునేది. రెండు మూడు సార్లు శశి హెచ్చరించి, అది సుజాతకి నచ్చడం లేదని అర్థమై వదిలేసింది.

సతీష్‌కి తల్లి అండ ఎక్కువ అయ్యి డిగ్రీ కూడా పూర్తి చెయ్యకుండా బిజినెస్ చేస్తాను అని మొదలు పెట్టాడు. మనలాంటి మధ్య తరగతి వాళ్లు బిజినెస్ ఆటుపోట్లు తట్టుకోలేరు అని రంగనాథ్ మొత్తుకున్నా తల్లీ, కొడుకు పెడచెవిన పెట్టారు.



సుజాతకి దగ్గర బంధువైన అమృత తండ్రి, బిజినెస్‌లో వాటా ఇస్తానని సతీష్‌కి అమృతతో పెళ్ళి జరిపించారు.

సుజాత కుటుంబం కంటే కూడా పై స్థాయి నుంచి వచ్చిన అమృతకి డబ్బంటే లెక్కలేదు. అవతల మాట్లాడుతున్నది అత్త మామలా, భర్తనా? అన్నది ఆమెకి అనవసరం. తనకి నచ్చకపోతే పెద్దా చిన్నా చూడకుండా నోటికి ఎంత వస్తే అంతా అనేసేది.

దానివల్ల సతీష్ పెళ్లి అయ్యాక ఇంట్లో బాగా గొడవలు జరిగి సతీష్ వాళ్లు వేరే వెళ్లిపోయారు.

రంగనాథ్‌కి తెలియకుండా అప్పుడప్పుడు సతీష్ వచ్చి సుజాత దగ్గర డబ్బులు తీసుకెళ్లేవాడు.

ఉదయం ఇద్దరూ వాకింగ్ వెళ్ళినప్పుడు రంగనాథ్ తన కుటుంబ సమస్యలు మధుతో చెప్పి బాధపడేవాడు. "సతీష్ బాగా చెడిపోయాడు మధూ! డబ్బులు వృథా చేస్తున్నాడు, తాగుడే కాదు వేరే వ్యసనాలు కూడా అలవాటు అయ్యాయని అనుమానం. అమృత, ఆమె కిట్టీలు, క్లబ్ పార్టీలు తప్ప ఇంటి సంగతే పట్టించుకోదు. నేను సతీష్‌ని కోప్పడితే, సుజాత సతీష్ ముందే నాతో గొడవ పడుతోంది, ఆ అలుసు తీసుకుని వాడు ఇంకా రెచ్చిపోతున్నాడు. ఈ ఒత్తిడితో నాకు ఈ మధ్య ఆరోగ్యం అసలు బాగుండడం లేదు. నా బాధంతా సుజాత గురించే, అకస్మాత్తుగా నాకేదైనా అయితే సతీష్ ఆస్తి మొత్తం నాశనం చేస్తాడు, సుజాత ఎలా బతుకుతుందో" అంటూ దిగులు పడ్డాడు.

"మీరు అంత బాధపడకండి రంగనాథ్! సతీష్ నెమ్మదిగా బిజినెస్‌లో బాగుపడొచ్చు. ఎందుకైనా మంచిది, మీరు ఇల్లు, కొన్ని డిపాజిట్లు సుజాత గారి పేరు మీద పెట్టండి. ఆవిడ వాటిని సతీష్‌కి ఇవ్వకుండా గట్టిగా జాగ్రత్తలు చెప్పండి. కనీసం ఆవిడకి ఉండడానికి, ఖర్చుకి.. అద్దె, కొంత వడ్డీ డబ్బు ఉంటుంది" అని సలహా చెప్పాడు.

అది నచ్చి రంగనాథ్ వెంటనే దాన్ని అమలు చేశాడు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఇల్లు అమ్మవద్దని, ఆ డిపాజిట్లు తన పేరు మీదే ఉంచుకోమని సుజాతకి గట్టిగా చెప్పాడు. నీ తదనంతరం వాడికి చెందే ఏర్పాటు చేశాను. నువ్వు ఉన్నన్ని రోజులు ఇవే నీకు ఆధారం" అన్న రంగనాథ్‌తో–

"మన సతీష్ మంచివాడండి, వాడికి నేనంటే ప్రేమ, నాకు ఇబ్బంది కలిగే పనులు చెయ్యడు. ఏదో పాపం వ్యాపారంలో నష్టం వచ్చి అలా డబ్బు వృథా అవుతోంది" అంది సుజాత.

"నీది ధృతరాష్ట్ర ప్రేమ, వాడి తప్పులు నీకు ఎప్పటికీ కనిపించవు. నేను ఉన్నంత కాలం నాకు భయపడి–వాడు, కోడలు జాగ్రత్తగా ఉంటారు. నాకేదైనా అయితే నీ బతుకు నరకం చేస్తారు. అదే నా భయం" భార్య గుడ్డి ప్రేమకి బాధగా నిట్టూరుస్తూ అన్నాడు.

రంగనాథ్ భయపడ్డట్టుగానే ఏడాదిలోపు అతను చనిపోయాడు. తండ్రి పోయాక, సతీష్ భార్యతో తల్లి దగ్గరికి వచ్చేశాడు. మామగారి నుంచి విడిపోయి వ్యాపారం తాను ఒక్కడే మొదలుపెట్టాడు.

మొదట్లో తల్లిని బాగా చూసుకున్న సతీష్, నెమ్మదిగా అసలు రంగు బయటపెట్టాడు. కొడుకు ప్రేమ వలలో సుజాత పూర్తిగా చిక్కుకుపోయింది.

ఒక దుర్ముహూర్తాన ఎలా మభ్యపెట్టాడో ఇల్లు తన పేరు మీద మార్చుకుని, దాన్ని తాకట్టు పెట్టి అప్పు తెచ్చి వ్యాపారంలో పెట్టాడు. సతీష్‌కి వ్యాపారంలో ఏమాత్రం దక్షత లేనందువల్ల అదీ పోయింది.

డబ్బు ఇబ్బందులు మొదలయ్యాక అమృత రోజూ ఏదో వంక పెట్టి అత్తగారితో గొడవ పెట్టుకోవడం, సుజాత మళ్లీ దెబ్బలాడడం ఒక రొటీన్ అయిపోయింది.

ఊర్కోమంటే అమృత వినేది కాదు, మాట్లాడొద్దంటే సుజాతకి కోపం. పూటపూటా ఇల్లు రణరంగంలా ఉండేది. సతీష్‌కి కూడా కోపం వస్తే, పెళ్ళాన్ని కోప్పడితే మామగారు వెంటనే రంగంలోకి దిగుతాడని భయంతో, తల్లినే అరిచేవాడు.

సుజాత, శశి దగ్గరికి వచ్చి ఈ గొడవల గురించి చెప్తే, శశి ఎటువంటి సలహాలు ఇస్తుందో అని భయానికి సతీష్, శశితో తల్లి ఎక్కువ మాట్లాడకుండా కట్టడి చేసేవాడు.

ఒకరోజు ఇల్లు వేలం వేస్తామని బ్యాంకు వాళ్లు నోటీస్ ఇచ్చేదాక చుట్టుపక్కల వాళ్ళకే కాదు, సుజాతకి కూడా తెలీదు, సతీష్ తమని అప్పుల్లో ముంచేశాడని. వేలంలో అప్పుకి సరిపడా ఇచ్చి ఎవరో ఇల్లు కొన్నారు. సతీష్ మొహం చాటేసాడు కానీ, సుజాత అద్దె ఇంటికి వెళ్లేముందు శశి దగ్గరికి వచ్చి చెప్పి వెళ్ళింది. శశి, ఇప్పటికైనా జాగ్రత్త పడమని, మిగిలిన డిపాజిట్స్ వరకు అయినా జాగ్రత్త చేసుకోమని. ఏ అవసరమున్నా ఫోన్ చెయ్యమని సుజాతకి చెప్పింది.

మధు, శశి, ఆ ఇల్లు కొన్నవాళ్ళు కొత్తగా వాళ్ళకి నచ్చినట్టు కట్టుకోవడానికి, పాత ఇల్లు కూలగొడుతుంటే, రంగనాథ్ ఎంతో ఇష్టంగా, కష్టపడి కట్టుకున్న ఇల్లు పరాయివాళ్ల పాలయిందని చాలా బాధపడ్డారు. పక్కవాళ్ళకే ఇంత బాధగా ఉంటే సుజాతకి ఇంకెంత బాధగా ఉంటుందో అనుకున్నారు.

శశి కూడా రిటైర్ అయ్యింది. కూతురు హైదరాబాద్‌లో ఉన్నా, కొడుకు వంశీ ఈ మధ్య ఉద్యోగంలో మంచి అవకాశం వచ్చిందని కుటుంబంతో బెంగళూరు మారాడు.

అక్కడ వంశీ తాము అద్దెకి ఉన్న ఫ్లాట్ అమ్ముతుంటే చౌకగా వచ్చిందని కొన్నాడు. రంగనాథ్ కుటుంబంలోని విషాదాలకి తల్లితండ్రి దిగులుగా ఉంటే, కొంత మార్పుగా ఉంటుందని తమ దగ్గరికి రమ్మని గట్టిగా చెప్పాక శశి, మధు బెంగళూరు వచ్చారు.

**"మన సతీష్ మంచివాడండి, వాడికి నేనంటే ప్రేమ, నాకు ఇబ్బంది కలిగే పనులు చెయ్యడు. పాపం.. వాడికి వ్యాపారంలో నష్టం వచ్చి అలా డబ్బు వృథా అవుతోంది" అంది సుజాత.**

శశి బెంగళూరు వచ్చేముందు సుజాత ఇంటికి వెళ్లి చూసి వచ్చింది. సుజాత పరిస్థితి చూసి శశి కళ్లలో నీళ్ల వచ్చాయి. తిండి కూడా సరిగ్గా తింటున్నట్టు లేదు. ఒంటి మీద బంగారం మాయం అయింది.

"ఏంటి సుజాతా ఇలా అయిపోయావు?" బాధగా అన్న శశితో–

"ఇది నా స్వయంకృతం. రంగనాథ్ ఎన్నోసార్లు చెప్పారు. ఇల్లు వాడి పేరు మీద రాయకు, డిపాజిట్స్ ఇవ్వకు అని. వాడు ఇల్లు తనకి రాయకపోతే చచ్చిపోతానని బెదిరిస్తే, నేనే నా ప్రేమ చంపుకోలేక వాడికి ఇచ్చేశాను. డిపాజిట్స్ కోసమే నన్ను ఇంకా సజీవంగా ఉంచారు. ఇప్పుడు నా బతుకు చాలా హీనంగా ఉంది, కొడుకు, కోడలు కొడుతున్నారు కూడా" ఏడుస్తూ అంది సుజాత.

"ఉన్న డబ్బులు పెట్టుకుని ఏ ఓల్డ్ ఏజ్ హోంలోనో చేరచ్చు కదా, లేదా మీ అమ్మాయి దగ్గరికి వెళ్లొచ్చు,

ఎందుకు ఇలా హీనంగా బతకడం సుజాతా!" అన్న శశి మాటలకి–

"ఆస్తి అంతా వాడికి ఇచ్చి, ఎక్కడో అమెరికాలో ఉన్న మా అమ్మాయి దగ్గరికి ఎలా వెళ్తాను? నేను ఓల్డ్ ఏజ్ హోమ్‌కి వెళ్తే కుటుంబం పరువు పోయినట్లే కదా.

అందరూ సతీష్‌ని తిడతారు. అది నా పెంపకాన్ని తిట్టినట్టే కదా! నేను చేసిన తప్పుకి శిక్ష నేనే అనుభవిస్తున్నాను. నువ్వు వచ్చేవరకు బతికుంటానని నాకు నమ్మకం లేదు" కోడలు వస్తున్న శబ్దం విని కళ్లు తుడుచుకుంది సుజాత.

హైదరాబాద్ విషయాలు గుర్తొచ్చి ఒకసారి బాగా దిగులుగా అనిపించిన మధు "హైదరాబాద్‌లో ఇల్లు అమ్మి బెంగళూరులో విల్లా కొనేయ్ వంశీ! మేం ఇక్కడే ఉండిపోతాం" అన్నాడు.

"నాన్నా! ఇక్కడ కొన్ని రోజులు ఉండి మేం కూడా హైదరాబాద్ వచ్చేస్తాం. పక్కింట్లో అలా అయిందని మీరు మనసు పాడుచేసుకుని మన ఇల్లు అమ్మితే మళ్లీ కొనగలమా? మీకు అలవాటైన ఏరియా, అది వదిలి మీరు ఎక్కువ రోజులు ఎక్కడా ఉండలేరు" అన్నాడు వంశీ.

అదీ నిజమే అనిపించింది మధు, శశిలకి.

అవన్నీ గుర్తొచ్చి శశికి ఉన్న నిద్ర ఎగిరిపోయింది.

పొద్దున్న ప్రియ మాట్లాడితే మంకీ ట్రాప్ అంది. అసలేమిటీ ఈ మంకీ ట్రాప్ అని గూగుల్‌లో వెతికింది.

"ఆఫ్రికాలో కోతులను వేటాడటానికి చెట్టు తొర్రలో కచ్చితంగా కోతి చేయిపట్టేంత రంధ్రం చేస్తారు. ఇది కోతి చేయి పట్టేంత పెద్దదిగా, పిడికిలి బయటికి రానంత చిన్నదిగా ఉంటుంది.

అందులో కోతికి ఆహారం ఉంచితే కోతి రంధ్రంలో చేయి పెట్టి పట్టుకుంటుంది, సరిగ్గా అప్పుడే కోతిని పట్టుకుంటారు. ప్రమాదం పొంచి ఉన్నా కోతి మాత్రం పట్టుకొన్నది వదిలి పారిపోదు. ఇదే మంకీ ట్రాప్.

మరి.. మనుషులు మంకీ ట్రాప్‌లో ఉన్నారు అంటే మనకి ప్రమాదమనీ, నష్టమని తెలిసినప్పటికీ కొన్నిటిని మనం వదులుకోలేకపోతున్నాం.

ఒక బిచ్చగాడు తిండి లేక చచ్చిపోయాడని, అతని పాతబట్టల్లో లక్షల రూపాయలు దొరికాయని, డబ్బు ఉన్నా ఖర్చు పెట్టి తిండి తినకుండా మంకీ ట్రాప్‌లో ఉన్నాడని వార్త వచ్చింది.

సంపాదించుకున్న కోట్లని దాచిపెట్టుకొని, పిసినారిగా బతుకుతూ, జబ్బు చేస్తే ఆసుపత్రికి కూడా వెళ్లకుండా చనిపోయినవాళ్లు ఉన్నారు. నిజంగా డబ్బు అంతగా కట్టి పడేస్తుందా? డబ్బు మాత్రమే కాదు, పదవి, బంధాలు, కీర్తి పట్టేసి ఉంచితే ఈ ట్రాప్‌లో ఉన్నట్టే."

ఇది చదివాక సుజాత "కొడుకు మీద ప్రేమ" అనే 'మంకీ ట్రాప్'లో ఉందన్న విషయం అర్థమైంది శశికి.

కొడుకు దగ్గర క్షేమం కాదని తెలిసినా అక్కడే ఉండి, అందరూ వద్దన్నా ఆస్తి కొడుక్కి అప్పచెప్పి నానా బాధలు పడుతోంది.

తెలిసి, తెలిసి ఇరుక్కునే తల్లితండ్రులు ఎంతోమంది ఆ ట్రాప్ నుంచి బయటికి రాలేక, రాక.. జీవితం ముగించుకుంటున్నారు. పిల్లల మీద ప్రేమ ఉండడం, ఆస్తి పంచడం తప్పుకాదు. ఆ గుడ్డి ప్రేమ, ఆ ఆస్తి పంపకం వీరి అస్తిత్వానికే దెబ్బకొడితే బతికిన ప్రతీ క్షణం దుర్భరంగా మారి ఎందుకు బతికి ఉన్నాను? అనే ప్రశ్న వస్తే.. అప్పుడు ఆ 'ట్రాప్' లాంటి బంధం నుంచి బయట పడడం తప్పు కాదు.

ఆడవారికైనా, మగవారికైనా ఏ బంధం అయినా అది పిల్లలైనా, భాగస్వాములైనా, బంధువులైనా.. ఆ బంధంలో స్వేచ్ఛ ఉండాలి.. శృంఖలాలు కాదు. హాయిగా గాలి పీల్చుకోవాలి.. ఊపిరాడనట్టుగా ఉండకూడదు.

**ఆడవారికైనా, మగవారికైనా ఏ బంధం అయినా.. అది పిల్లలైనా, భాగస్వాములైనా, బంధువులైనా.. ఆ బంధంలో స్వేచ్ఛ ఉండాలి శృంఖలాలు కాదు. హాయిగా గాలి పీల్చుకోవాలి.. ఊపిరాడనట్టుగా ఉండకూడదు.**

నిజంగా అటువంటి బంధంలో బందీగా ఉంటే, బయట పడేందుకు మానసిక శక్తి మాత్రమే కాదు, ఆర్థిక స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం.

మొదటి నుంచి పిల్లలకి ఆస్తితో పాటు బాధ్యత కూడా పంచాలి. వాళ్ళు తల్లిదండ్రి కంటే ఆస్తి ముఖ్యం అనుకుంటే పెద్దలు కూడా పిల్లల కంటే ఆస్తికి విలువ ఇవ్వాలి. ఉన్న సంపద బతికి ఉండగానే పిల్లలకి ఇచ్చి నిత్యం చచ్చేకన్నా, ఏదైనా తదనంతరం అందే ఏర్పాటు చెయ్యాలి.

ప్రభుత్వం సీనియర్ సిటిజన్ల సంక్షేమం, పోషణ నిమిత్తం, 2007లో పెట్టిన చట్టం (56) ప్రకారం పెద్దవారి హక్కులు, పిల్లలకి వారి పట్ల బాధ్యతలు నిర్దేశించింది. తల్లితండ్రుల ఆస్తి తీసుకుని పిల్లలు వారిని సరిగ్గా చూడకపోయినా, డబ్బులేని తల్లితండ్రులని పిల్లలు నిర్లక్ష్యం చేసి వదిలేసినా వారి మీద ప్రభుత్వం ద్వారా చర్య తీసుకోవచ్చు.

చాలామంది వృద్ధులకు ఈ విషయం గురించి అవగాహన లేదు. కొందరు పిల్లల మీద చర్య తీసుకోవడానికి ఇష్టపడక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారికి ఈ విషయాలు తెలియచేసి పిల్లల ట్రాప్‌లో పడి, ఉన్న డబ్బు పోగొట్టుకుని రోడ్డు మీద పడకుండా తనలాంటివాళ్ళు కాపాడాలి. చివరి దశలో పండుటాకులని ఎండిపోకుండా కాపాడుకోవాలి. అదే తమ తక్షణ కర్తవ్యం.

ఇలా ఆలోచనల్లో మునిగిన శశి తెల్లవారింది కూడా గమనించలేదు,

"ఏమిటీ! త్వరగా లేచేశావా? సరిగ్గా నిద్ర పట్టలేదా?" అడిగాడు అప్పుడే కళ్ళు తెరిచిన మధు.

"ఇప్పుడే మేలుకుంటున్నాను" అంది శశి వికసించిన మనసుతో.

---

న– తాను వెళ్లదలచుకున్న దేశం భాష తెలియకుండా ప్రయాణం చేస్తే ఆ దేశంలో మునిగా, అమాయకంగా, నిస్సహాయంగా, అర్థరహితంగా మిగులుతారు.

– ఎమర్సన్

– సోమరిగా కాలాన్ని, యౌవనాన్ని వృథా చేసుకుంటూ, మందకొడిగా ఇంటివద్ద జీవితం గడిపేకన్నా హాయిగా విదేశాలలో విహరిస్తూ ప్రపంచ వింతలను చూడు.

– షేక్స్పియర్

# తెలుగు తేజోదీప్తి-పద్యం

సంస్కృత పద్యాలలో లేని ప్రాస అనే నియమం, తెలుగు పద్యరచనకు విశిష్ట లక్షణమైంది. సుమారుగా 7వ శతాబ్దం నుండి తెనుగులో రాయబడిన గద్య, పద్య శాసనాలు మనకు లభిస్తున్నాయి. దేశ భాష అయిన తెలుగుకు రాజపోషణ, పండితాదరణ లేని యుగం అది. తెలుగు సంస్కృత శబ్దాలను చేర్చుకొని క్రమ వికాసం పొంది, 11వ శతాబ్దం నాటికి తూర్పు చాళుక్యుల కాలంలో, ఆ రాజ వంశంలోని 27వ రాజు రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో ఆంధ్ర మహాభారత రూపంగా వెలసింది.

అందువలన తెనుగునాట తెనుగును వెలయించిన తూర్పు చాళుక్య నృపతుల యుగారంభంలో తెనుగుకు ప్రాధాన్యత వచ్చింది. సామాన్య జనావళికి ప్రాకృత, సంస్కృత భాషలు ఆ కాలంనాటికి క్రమేణా దూరం కావటం కారణంగా. నాటి రాజులు, మత గురువులు తెనుగును ఆదరింపక తప్పలేదు. ఆ నాటి తెనుగు రాజ శాసనాలు రాయడానికి దేశ భాషగా వెలుగు చూపింది. సామాన్య ప్రజలలో వాడుకలో ఉన్న గేయ, పద్య, వాఙ్మయం దేశీయచ్ఛందస్సు లయిన తేటగీతి, ఆటవెలది, సీసము తొలి యుగంలోనే ఆవిర్భవించాయి. భారతాంధ్రీకరణం నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ ముగ్గురు కవులచే సుమారు 300 సంవత్సరాలలో పూర్తి చేయబడింది. భారత రచనలతో తెనుగు వాఙ్మయ రచనకు మార్గం ఏర్పడింది. సంస్కృత ప్రాబల్యాన్ని తగ్గించి, తెనుగుకు కేవలం భాషాంతరీకరణం కాకుండా, స్వతంత్ర గ్రంథంగా, దేశీయ ప్రాధాన్యతయిచ్చిన నన్నిచోడుని బాటలో, పాలకురికి సోమన రాసిన బసవపురాణం అవతరించింది. నన్నయాదుల కంటే భిన్న మార్గంలో దేశీయ పలుకుబళ్లతో, తెనుగుతనం ఉట్టిపడేటట్టు పండితారాధ్య చరిత్ర వంటి వీరశైవ వాఙ్మయం తర్వాత ఆరేడు, శతాబ్దాలు రాజ్యమేలింది. ఒకప్పుడు తెలుగులో కావ్యాలంటే పద్యకావ్యాలే. దేశ కాలానుగుణంగా వ్యావహారికాంధ్రం వ్యాకరణం లేకపోయినా ఛందో నియమ బంధాలను తెంచుకొన్నా తెలుగు సజీవంగా వృద్ధి అవుతూనే వుంది. శాపన భాష, కావ్యభాష అయిన తెనుగు శతాబ్దాల కాలగతి నుంచి, వ్యావహారికంగా విలసిల్లినా నేటికీ సాగరమంత లోతైన భావాలను అత్యంత సరస సరళంగా రాయగల, సంభాషించగల, వ్యక్తీకరించగల సాహితీ ప్రక్రియలు తెలుగును సజీవం చేస్తున్నాయి. కాని తెలుగు చదువరులు తగ్గిపోతున్న వాస్తవ స్థితిగతులు తలెత్తుతుండటం మాతృభాషా ప్రేమికులను తల్లి భాషాభిమానులను తల్లడిల్లచేస్తోంది. మాతృభాష అయిన తెలుగు జీవితావసరంగా గుర్తింపబడకపోవటమే దానికి కారణం.




ప్రత్యేకంగా ఆసక్తి, అభిమానంతో తమ పిల్లలు తెలుగు భాష కూడా తెలిసినవారై ఉండాలన్న తపన వున్న కొందరు తల్లిదండ్రులు తప్ప తెలుగుకు ప్రోత్సాహం లేని మాట వాస్తవం. ఇక పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల సంగతి సరేసరి. రాను రాను తెలుగు చదివేవారి సంఖ్య మరింత కుంగి కృశించి మాతృభాష మృతభాష కాకుండా రక్షించుకోవాలనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వాలు తెలుగును ప్రోత్సహించాలని పత్రికలు, ఎలక్ట్రానిక్ చానళ్లు ప్రత్యేకంగా శ్రద్ధాసక్తులతో చర్యలు చేపట్టాలని రచయితలు, కవులు హెచ్చరిస్తున్నారు. తెలుగునాట ప్రస్తుత యువతరంలో పఠనాసక్తి మాతృభాషానురక్తి పెంపొందింపచేసే తక్షణ కార్యాచరణ అత్యవసరమని భాషా పరిశోధకులు సూచిస్తున్నారు. యువతరంలో ముఖ్యంగా పాఠశాలల బాల బాలికలలో అనురక్తి, ఆసక్తి, అభినివేశాన్ని అంకురింపచేసేందుకు పాఠ్యప్రణాళికలను రూపొందింపచేయాలి. పద్యాన్ని కడురమ్యంగా నడిపిన కవులు, పండితులు, సాహిత్య స్రష్టలు తెలుగులో అసంఖ్యాకంగా వున్నారు. ఇప్పుడు కూడా పద్యం కొత్త పుంతలు తొక్కుతోంది. సంగీతం, లయ, శబ్దాలంకారం, వీనుల విందైన నడక, భావజాలంతో చిన్న పద్యంలో ప్రాణప్రతిష్ఠ చేయగల భాషా ప్రేమికులు తెలుగులో కోకొల్లలు కానీ పద్య నాటకాలకు ఆదరణ లేని మాట నిజమే. అష్ట, శత, సహస్రావధానులు నేటికీ తెలుగు సాహిత్య సీమలో విరాజిల్లుతున్నారు. మానవ దైనందిన జీవనావసరాలు, అధునాతన నాగరికతా జీవన విధానాలు ఎన్నో విలువలను దూరం చేస్తున్నాయి. పద్య రత్న గర్భ అయిన తెలుగు సాహితీ సంద్రంలో అనర్ఘ రత్నాలున్నాయి. అయినా సాహితీ సంద్రంలో మునక, ఈదులాట సామాన్య విషయం కాదు.

కం॥ తేరా పలకా బలపము
ఈయరా అయవారి
చేతికింపులరంగా!
పోరా భోజన వేళకు
రారా పద్యాలు చదువ
రాజకుమారా!

అలతి అలతి పదాలతో వున్న ఇటువంటి భావగర్భిత పద్యాలు సందేశాలు అందిస్తున్నాయి. సుమతీ శతకం, వేమన శతకం వంటి శతక పద్యాలు తెలుగువారి అక్షర సంపద, ప్రయోజనం సంగతి ఎలా ఉన్నా, పద్య ప్రక్రియతో ఆటపాటయిన చదువులో ఎన్నో ఎన్నెన్నో బాలబాలికలకు పరిచయం, పునఃపరిచయం పునశ్చరణ... అనిపిస్తే బాగుంటుంది.

**- జయసూర్య**

# నేపాల్ కథా కమామిషు

నేపాల్‌ని కొన్ని శతాబ్దాల పాటు రాజులే పాలించారు. అయితే ఆ తర్వాత రాజు ప్రధాన పరిపాలకుడుగా ప్రధానమంత్రి నేతృత్వంలో పాలక ప్రభుత్వం ఏర్పడింది. దశాబ్దం క్రితం రాజును ఆయన కుటుంబాన్ని రాజవంశీయులే హత్యచేయడం తీవ్ర సంచలనం కలిగించింది. అప్పటి రాజుగారి తమ్ముడు బీరేంద్ర రాజుగా అధికారంలోకి వచ్చాడు.

ఒకప్పుడు నేపాల్‌లో పన్నెండు యేళ్ల పాటు ఘోరమైన క్షామం వచ్చింది. దానివల్ల దేశం నాశనం అయ్యే పరిస్థితి ఏర్పడింది. అప్పటి నేపాల్ ప్రభువైన రాజా నరేంద్రదాస్ క్రీ.శ.347లో అస్సాంకు వెళ్లి ఒక మహాత్ముడైన బౌద్ధ భిక్షువును ఆహ్వానించి తీసుకువచ్చాడట.

ఆయన ఆగమనానికి సంతోషిస్తూ బ్రహ్మ వేదగానం చేస్తూ నగర వీధులను శుభ్రం చేశాడట. విష్ణుమూర్తి శంఖం పూరించాడట. మహాదేవుడు పురవీధులపై నీళ్లు చల్లాడట. ఇంద్రుడు గొడుగు పట్టాడట. యముడు ధూపం వేస్తే, కుబేరుడు సంపదలు వెదజల్లాడట. అగ్నిదేవుడు దీపాన్ని వెలిగించగా వాయుదేవుడు విజయకేతనం ఎగిరేలా చేశాడు. ఆయన రాకతో పుష్కలంగా వర్షం కురిసి దేశం కరువు బారినుండి బయట పడినట్లు తెలుస్తోంది.

ఆ శుభ సంఘటనకు గుర్తుగా రాజా నవీంద్రదాస్ మచ్ఛీంద్రనాథుని ఆలయం నిర్మించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించాడట. ఇప్పటికీ యేటేటా వైశాఖ శుద్ధ పాడ్యమి నుండి ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయి.

రాజకుటుంబం హత్యకు గురికావడం నేపాల్‌లో జరిగిన దురదృష్టకర సంఘటన. తర్వాత అక్కడ రాజకీయాలు అనేక ఆటుపోట్లకు గురయ్యాయి. అన్నిటికన్నా ఘోరమైన విపత్తు ఇటీవల సంభవించిన నేపాల్ భూకంపం. ఈ భూకంపం ధాటికి జనవాసాలేకాక అనేక చారిత్రక కట్టడాలు కూడా ధ్వంసమయ్యాయి. పెద్ద ఆలయాలు దెబ్బతిన్నాయి.

అనేకమంది తమ ఇళ్లు, ఆస్తులు కోల్పోయారు. ప్రపంచ దేశాలు కొన్ని ఈ ఘోరవిపత్తు నుండి నేపాల్‌ను రక్షించడానికి తమవంతు సాయం చేశాయి. అయినా ఇప్పటికీ ఆ భూకంపం నుంచి కోలుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ సంఘటనల్లో భారత ప్రభుత్వం నేపాల్‌కు ఆర్థిక సహాయం అందించడమేగాక పునరావాస కార్యక్రమాల్లో ఎంతగానో తోడ్పడింది.

ఖాట్మండులో పశుపతినాథ దేవాలయం, గుహ్యేశ్వరి ఆలయం, ఇతర ఆలయాలను దర్శించే పర్యాటకులు బౌద్ధనాథ్ ఆలయాన్ని కూడా దర్శిస్తారు. ఈ బౌద్ధనాథ స్థూపం బౌద్ధులు నిర్మించిందే. భారతదేశంలోనే బౌద్ధం ఆవిర్భవించింది. మహాయోగి ప్రపంచం మహోన్నత అవతారంగా భావించే గౌతమబుద్ధుడి సూత్రాలతోనే



బౌద్ధమతం ఏర్పడిరది. ఆనాటి రాజులు అశోకచక్రవర్తి అజాతశత్రువు, హర్షుడు వంటి చక్రవర్తులు బౌద్ధమత వ్యాప్తికి తీవ్ర కృషి చేశారు.

భారతదేశంలో పుట్టిన బౌద్ధం ఇతర దేశాలకు వ్యాపించింది. కొన్ని దేశాలలో బౌద్ధమతం ముఖ్యమైనదిగా నేడు కొనసాగుతున్నది. ఖాట్మండుకు పశ్చిమంగా రెండు మైళ్ల దూరంలో కొండ మీద బౌద్ధ మందిరం ఉంది. ఇక్కడే స్వయంభూనాథ్ స్థూపం ఉంది. దాదాపు 4 వందల దాకా మెట్లు ఉంటాయి. సుమారు 20 అడుగుల దిబ్బమీద ఇక్కడ 45 అడుగుల ఎత్తు శివలింగం కనిపిస్తుంది. ఈ లింగం అడుగుభాగం చతురస్రాకారంలో ఉంటుంది.

నాలుగు వైపులా త్రినేత్రాలుంటాయి. ఖాట్మండులోని అనేక ప్రాంతాల వరకు ఈ కళ్లు కనిపిస్తుంటాయి. దీని చుట్టూ చిన్న పెద్దవి అయిన అనేక బౌద్ధ స్థూపాలు మందిరాలు ఉంటాయి.

ఇక్కడ బౌద్ధులే గాక హిందువులు కూడా ఏ తారతమ్యాలు లేకుండా పూర్వంనుంచి ఒకే చోట బుద్ధుడి ఆరాధన శివపూజలు చేస్తున్నారని ప్రసిద్ధ యాత్రికుడు హ్యూయన్‌సాంగ్ తన గ్రంథంలో తెలిపాడు. ఇప్పటికీ ఇక్కడ సామరస్యపూర్వక భక్తివాతావరణం కనిపిస్తుంది.

ఈ స్వయంభూనాథ స్థూపం క్రీ.శ. 5వ శతాబ్దంనాటికే ప్రసిద్ధ యాత్రాస్థలం. 15వ శతాబ్దికి చెందిన స్వయంభూ పురాణంలో ఈ స్థలానికి సంబంధించిన అనేక కథలున్నాయి.

నేపాల్ పుట్టుక గురించి కూడా అనేక పురాణ గాథలున్నాయి. స్వయంభూ పురాణం ప్రకారం పూర్వం నేపాల్ లోయ దట్టమైన అరణ్యాలు పర్వతాలతో కూడిన అగాథమైన సరస్సు. ఆ సరస్సు పేరు నాగవాస సరోవరం. ఈ సరోవరం అనేక పక్షులు లతలకు చెట్లకు నిలయంగా ఉండేదట. అయితే ఈ సరస్సులో పద్మాలు ఉండేవి కావట.

ఒకసారి విపాసీబుద్ధుడు తన శిష్యులతో దేశాటన చేస్తూ ఈ సరోవర తీరానికి వచ్చి విడిది చేశాడు. ఒకనాడు ఆయన ఈ సరస్సులో స్నానం చేసి సరస్సుకు మూడు సార్లు ప్రదక్షిణ చేసి దానికి నైరుతి వైపు పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. ఒక తామరదుంపను తీసుకుని మంత్రించి ఆ సరస్సులోకి విసిరేసి ఏ రోజైతే ఈ తామరతూడు మొలకెత్తి పువ్వు పూస్తుందో ఆ రోజున అగ్ని స్థభువన నాథుడైన స్వయంభూదేవుడు ఈ పద్మంలో అవతరిస్తాడు. అగ్నిజ్వాల రూపంలో ప్రత్యక్షమౌతాడు. అప్పటి నుంచి ఈ సరస్సు సశ్యశ్యామలమై జనవాసంగా మారిపోతుంది” అని వక్కాణించాడు. తర్వాత కొద్ది కాలానికే నేపాల్‌రాజ్యం ఆవిర్భవించింది.

**- యామిజాల జగదీశ్**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458




# దిగ్వక్ర వేధ అంటే ఏమిటి?

**ఎస్.మహేశ్, విజయవాడ**

**ప్రశ్న: దిగ్వక్ర వేధ గురించి తెలుపగలరు.**

**వచనం: రంధ్ర వికీర్ణం దిగ్వక్రం**

**జవాబు:** ఒక గృహం నాలుగు దిక్కుల యందుగాని, గృహం లోపలి భాగం నందుగాని, కిటికీలకు ఎదురుగా కిటికీలు, తలుపులకు ఎదురుగా తలుపులు ఉండకుండా పారుదప్పి ఉన్నట్లయితే 'దిగ్వక్ర' మనే (దోషం) వేధ కలుగుతుంది.

'దిగ్వక్రే గర్భనాశస్స్యాత్' అనే శాస్త్ర వచనానుసారం యిటువంటి దోష పూరితమైన గృహంలో నివసించేవారికి, యజమాని కుటుంబానికి గర్భ స్రావాలు, సంతాన నష్టాలు మొదలైన చెడు ఫలితాలు కలుగుతాయని గమనించాలి.

కానీ తలుపుకు ఎదురుగా తలుపు, కిటికీకి ఎదురుగా కిటికీ తప్పనిసరి కాదు! ఎదురుగా తలుపు 'అవసరమై' పెట్టవలసి వస్తే 'పారుదప్పకుండా' తలుపుకు ఎదురుగానే తలుపు పెట్టుకోవాలి.

కిటికీలు కూడా అంతే! అవసరమున్నా లేకపోయినా.. ప్రతి తలుపుకు ఎదురుగా తలుపు, ప్రతి కిటికీకి ఎదురుగా కిటికీ పెట్టగూడదు. తలుపుగానీ కిటికీగానీ పారుదప్పి ఉండకూడదు. అంటే సగం మధ్యలోకి రాకూడదు.

## చిపిటక వేధ

**వచనం: తుంగహీనంతు చిపిటం**

ఒక గృహం 'ఆయము'నను సరించి ఆ గృహం లోపలి ఎత్తు నిర్ధారింపబడుతుంది. గృహం లోపల సాధారణంగా ఉండవలసిన ఎత్తు కంటే తక్కువ ఎత్తు ఉన్నట్లయితే 'చిపిటకము' అనే (దోషం) వేధ కలుగుతుంది.

ఇటువంటి చిపిటక వేధ గల ఇంట నివసించువారు, ఆ గృహ యజమాని అనేక దుర్వ్యసనాలకు లోనుగావచ్చని శాస్త్రవచనం. ముఖ్యంగా దొంగతనం, జూదం, మద్యపానం మొదలైన వ్యసనాలకు లోనుగావచ్చు. గృహ నిర్మాణ సమయంలోనే 'ఎత్తు' విషయమై జాగ్రత్త పడటం అత్యంత ఆవశ్యకం.

**– సి.వసుధ, నల్గొండ**

**ప్రశ్న: మా వారి పేరు బాదం వివేకానంద. పుట్టిన తేది 11-01-1976, వృషభరాశి. మావారి పేరు మీద ఏ ముఖద్వారం ఉన్న ఫ్లాట్ తీసుకోవాలి? మేం ఇప్పుడు సొంత ఫ్లాట్‌లోనే ఉంటున్నాం.**

**అది ఉత్తర ముఖద్వారం, ప్రస్తుతం వున్న క్లిష్ట పరిస్థితుల్లో అగమ్యగోచరంగా ఉంది.**



**జవాబు:** అతనికి వ్యవహార నామరీత్యా పశ్చిమ ముఖద్వారమున్న ఇంట్లో నివసించినట్లయితే తక్కువ శ్రమతో ఎక్కువ మంచి ఫలితాలను పొందగలరు. అతనికి ఎదురయ్యే ప్రధాన సమస్య 'ద్వైదీ భావం'. అంటే అతడు ఏదైనా నిర్ణయం తీసుకోవటంలో ఊగిసలాడే పరిస్థితిలో ఉండిపోతూ ఉంటారు. అందువల్ల అందివచ్చిన అవకాశాలు సైతం కనుమరుగవుతాయి.

ఈ పరిస్థితి పునరావృతం అవుతూ ఉండటం వలన ఎక్కువ ధనాన్ని, సమయాన్ని నష్టపోతూ ఆత్మ విశ్వాసాన్ని కూడా కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయి. అందుకని ముందస్తుగా తేలికపాటి 'ప్రత్యామ్నాయ పద్ధతులు' ఆచరించండి.

లేత ఆకుపచ్చ, తెలుపురంగు దుస్తులు ధరించడం, అవే రంగు పాదరక్షలు ధరించడం, నలుపు రంగు వస్తువులు కలిగి 'ఉండకపోవడం' రాత్రుళ్లు వృద్ధిచంద్రుడిని కొంతసేపు ప్రశాంతంగా వీక్షించడం. పౌర్ణమి రోజున ఆగ్నేయంలో పాలు పొంగించటం, చల్లార్చిన పాలు తాగటం మొదలైన చిరు ప్రత్యామ్నాయాల వలన చాలా మంచి ఫలితాలు ఉంటాయి. 'ద్వైదీభావం' తగ్గుతుంది. తన సామర్థ్యాన్ని చూపించుకునే అవకాశాలు వస్తాయి. తద్వారా సమర్థవంతంగా పరిస్థితులను ఎదుర్కోగలుగుతారు. ■

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..........................................

పుట్టిన తేది : ..........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .............

చిరునామా:..............................................

– లోక వ్యవహారాలను పరమార్థసాధనంగా మలచుకోగలిగినవాడు మహాత్ముడు.

– సరైన సమయంలో, సరైన క్షణంలో పలికిన పలుకు తరతరాలు నిలుస్తుంది. – థామస్ కార్లైల్

**ఆలయదర్శనం**

# అతి పురాతన ఆలయం

**ఆంధ్రప్రదేశ్‌లోని పల్లె పల్లెలో పురాతన ఆలయాలు కనిపిస్తాయి. నాటి సంఘంలో హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, సంప్రదాయాలను, దైవభక్తిని పెంపొందించడానికి ఆలయ నిర్మాణం జరిగింది. దేవాలయం అనగా సకల చరాచర సృష్టికర్త అయిన దేవదేవుని నిలయం.**

ప్రతి ఒక్క ఆలయం తమదైన ప్రత్యేకతలతో నిత్యపూజలతో కళకళలాడుతున్నాయి. దీనికి కారణం నాడు నాటిన దైవభక్తి బీజాలే! ఇన్ని వందల సంవత్సరాలుగా నిత్యం పూజలు జరుగుతూ వస్తున్నాయి అంటే కారణం.. గ్రామస్థుల హృదయాలలో తరతరాలుగా సుస్థిరంగా స్థిరపడిన భక్తిభావం. ఆ నిఖిల జగద్రక్షకుని పట్ల వారికి గల నమ్మకం, వంశపారంపర్యంగా ఆలయాలను ఆధారంగా చేసుకొని నిరాకార స్వరూపుడైన పరమేశ్వరుని సేవిస్తూ తరతరాలుగా జీవనం సాగిస్తున్న అర్చక స్వాముల అచంచల విశ్వాసం.

ఇలాంటి దృఢమైన భక్తిశ్రద్ధలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పూజలు, ఉత్సవాలు మన హిందూ ధర్మంలో తప్ప మరెక్కడా కనిపించవు. ఇంతటి గౌరవం దక్కించుకొన్న హిందూ సమాజం సాటి మరొకటి ప్రపంచంలో లేదంటే అతిశయోక్తి కాదు. కృష్ణా నదీ తీరంలో ఉన్న ప్రతి ఒక్క గ్రామంలో కూడా పురాతన ఆలయాలు కనిపిస్తున్నాయి. ఆ ఆలయాల ప్రత్యేకతల గురించి అందరికీ తెలియచేయాలన్న సంకల్పంతో క్షేత్రాలను సందర్శించి వివరాలు సేకరించి ఈ వ్యాసాలను రాయడం జరిగింది.

ఆ పరంపరలో తెలియచేస్తున్న శ్రీ నాగేశ్వరస్వామి ఆలయం, విజయవాడకు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న చిర్రావూరు అనే గ్రామంలో ఉన్నది. చిర్రావూరు కృష్ణానదీ తీర గ్రామం. గుంటూరు జిల్లాలో ఉన్నా చిర్రావూరు విజయవాడకి దగ్గరగా ఉంటుంది.

విజయవాడ నుండి గుంటూరు వెళ్లే మార్గంలో తాడేపల్లి నుండి కుంచనపల్లి, గుండిమెడ గ్రామాల మీదుగా చిర్రావూరు సులభంగా చేరుకోవచ్చు. తెనాలి, మంగళగిరి నుండి కూడా చిర్రావూరు వయా రేవేంద్రపాడు, దుగ్గిరాల మీదగా వెళ్లడానికి చక్కని రహదారి ఉన్నది. విజయవాడ నుంచి సిటీ బస్సులు కూడా లభిస్తాయి. స్వంత వాహనంలో వెళితే చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న ఆలయాలను కూడా దర్శించుకొనే అవకాశం లభిస్తుంది.



ఇది పురాతన ఆలయం. ఆలయ నిర్మాణ కాలం గురించి, ఎవరు నిర్మించారు అన్న వివరాలు ఏవీ తెలియడం లేదు. శాసనాలు కూడా కనిపించవు. కానీ ఆలయ నిర్మాణ శైలి, కొలువైన దేవీదేవతల విగ్రహాలు చూసిన మీదట కొంతవరకు ఒక అంచనాకు రావచ్చు.

## ఆలయ చరిత్ర

ఈ ప్రాంతాన్ని పదో శతాబ్ద కాలంలో చాళుక్య రాజులు పరిపాలించారు. వారు తమ రాజ్యంలో అనేక ఆలయాలను నిర్మించారని తెలుస్తోంది. ముఖ్యంగా వారు ఆలయాలు లేని గ్రామాలను గుర్తించి అక్కడ శివ, విష్ణు ఆలయాలను నిర్మించారని చరిత్ర చెబుతోంది.

అలా ఈ ఆలయం కూడా వారి కాలంలో నిర్మించినట్లు, భావి విజయనగర పాలకులు చివరగా అమరావతి పాలకుడైన శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఈ ఆలయాల పునః నిర్మాణం చేయడమే కాకుండా నిర్వహణకు నిధులు, భూమి దానంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రాంగణంలో ఉన్న పురాతన విగ్రహాలు, నందీశ్వరుడు, విమాన గోపురం, గర్భాలయంలోని శివలింగం మనకు తెలుపుతాయి.. మేం చాలా కాలంగా ఇక్కడ ఉన్నాం అన్న విషయాన్నీ! ముఖమండపం పైన కనిపించే విగ్రహాలను నూతనంగా ఏర్పాటు చేశారు.

## ఆలయ విశేషాలు

జమ్మి, రావి, ఉసిరి, మారేడు, పారిజాతం, వేప, మామిడి చెట్లతో నిండిన ప్రాంగణంలో ఉంటుంది చిన్న ఆలయం. రాజగోపురం లాంటి పెద్ద నిర్మాణాలు, శిల్పాలు కనిపించవు. సాదాసీదాగా ఉంటుంది. ప్రాంగణంలో కొన్ని నిర్మాణాలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. ముఖమండపం పైన కుమారులతో కొలువైన ఆదిదంపతులు, స్వయంగా అభిషేకం చేసుకొంటున్న గంగాధరుడు, శివలింగ ప్రతిష్ఠ చేస్తున్న సీతారామచంద్రులు, లక్ష్మణుడు, హనుమంతుడు కనిపిస్తారు. ఆలయానికి ప్రధాన సంకేతం అయిన ఎత్తైన ధ్వజస్థంభం దూరానికి స్పష్టంగా కనిపిస్తుంది.

## శ్రీ వినాయక సన్నిధి

నూతనంగా ప్రాంగణ ఆగ్నేయ దిశలో నిర్మించిన ఈ సన్నిధిలో ఆది దంపతుల ప్రియ పుత్రుడు గణాధిపతి, విఘ్న నాయకుడు శ్రీ వినాయకుడు ఉపస్థితులై ఉంటారు. కుడివైపు తిరిగిన తొండంతో ఉన్న వలంపురి వినాయకుడు.

ఇతడు భక్త సులభుడు, మనోభీష్టాలను నెరవేర్చేవాడు. పక్కనే పురాతన భిన్నమైన గణపతి విగ్రహం మనకు ఈ ఆలయం ఎన్నో శతాబ్దాల క్రితం నిర్మించబడింది.. అనే విషయాన్ని స్పష్టం చేస్తుంది.



### ప్రధాన ఆలయం

ఈ ఆలయ గర్భాలయ దక్షిణ వెలుపల భాగంలో శ్రీ వేలాయుధ సుబ్రహ్మణ్య స్వామి పైన వీణాపాణి అయిన శ్రీ దక్షిణామూర్తి, ఆ పైన శ్రీ ధ్యానేశ్వరుడు పడమర భాగంలో అర్ధనారీశ్వరుడు, లింగోద్భవుడు, ఆ పైన శ్రీమహావిష్ణువు కనపడతారు.

ప్రత్యేకంగా ఉత్తరం పక్కన ఉన్న దేవతా రూపాల గురించి చెప్పుకోవాలి. సహజంగా గోముఖి వద్ద శ్రీ చండికేశ్వరుడు ఉంటారు. కానీ ఇక్కడ శబరిగిరి వాసుడైన శ్రీ ధర్మశాస్త్ర దర్శనమిస్తారు. విమాన గోపురంపైన గదాధరుడైన గంగాధరుడు ఆ పైన విధాత బ్రహ్మ దేవుడు విగ్రహాలు ఉంటాయి.

తరిచి చూస్తే ప్రతి విమాన గోపురం పైన త్రిమూర్తులు ఉండటం కనిపిస్తుంది. మిగిలిన దేవీదేవతలు రూపాలను ప్రత్యేకంగా స్థానిక భక్తుల మనోభీష్టాల ప్రకారం ఏర్పాటు చేయడం జరిగింది అనిపిస్తుంది.

తరువాత కాలంలో కాకతీయులు, రెడ్డి రాజులు, ముఖమండపం పైన శివలింగ ప్రతిష్ట చేస్తున్న సీతారామచంద్రులు, పక్కన లక్ష్మణ, హనుమంతుడు కనిపిస్తారు. ఈ రూపాలను ఉంచడానికి ప్రధాన కారణం కృష్ణాతీరంలో అనేక ప్రదేశాలలో శ్రీరాముడు సపరివారంగా వచ్చి శివ లింగాలను ప్రతిష్ఠించారు అని చెప్పడం. ఈ లింగం కూడా దశరథ రాముని ప్రతిష్ట అవడానికి అవకాశం ఉన్నది.

ఆలయ ఈశాన్య భాగంలో నవగ్రహ మండపం నిర్మించబడింది. నూతన నిర్మాణం, ముఖమండపంలో కొద్దిగా ఎత్తైన గద్దె మీద నందీశ్వరుడు కుడి కాలు ఎత్తిన భంగిమలో తదేక దృష్టితో గర్భాలయం వంక చూస్తుంటారు. ఇలా కుడి కాలు ఎత్తిన నందీశ్వరుడు చోళుల కాలంలో పెద్ద సంఖ్యలో ప్రతిష్ఠించబడ్డాయి. తమిళనాడులో పలు ఆలయాలలో కుడి కాలు ఎత్తి కూర్చున్న నందీశ్వర విగ్రహాలు కనిపిస్తాయి. తిరువణ్ణామలై (అరుణాచలం)లో కనిపించే నంది విగ్రహాలలో అధిక భాగం కుడి కాలు ఎత్తి ఉండటం గమనించవలసిన విషయం. ఇలా నందీశ్వరుడు కొలువుతీరి ఉండటానికి సంబంధించి ఒక కథ కూడా వినిపిస్తుంది.

చోళులకు బంధువులైన చాళుక్యులు కూడా వారి సంప్రదాయాన్ని అనుసరించి ఉండవచ్చు. అందువలన ఈ ప్రాంతంలో ఇలాంటి ప్రత్యేక నంది విగ్రహాలు అనేక ఆలయాలలో కనిపిస్తాయి. గర్భాలయ వెలుపలి గోడలలో శ్రీ అనంతనాగ, శ్రీదేవీ రూపం కనిపిస్తాయి, శ్రీ నాగేశ్వర స్వామి ఆలయం నాగప్రతిష్ఠలకు, సర్ప, రాహు-కేతు దోష పరిహార స్థలం అని చెబుతారు. ఆలయ వాయువ్య భాగంలో నూతనంగా నిర్మించిన శ్రీ సుబ్రహ్మణ్య సన్నిధి ప్రత్యక్ష రూపం. ద్వారపాలకులు దిండి, ముండి కూడా కనిపిస్తారు.

ముఖమండపాన్ని గర్భాలయంతో కలుపుతూ చిన్న అర్ధ మండపం ఉంటుంది. అక్కడ ఒక నందీశ్వరుడు కుడి కాలు ఎత్తి ఉపస్థితులై ఉంటారు, గర్భాలయానికి ఇరుపక్కలా వలంపురి వినాయకుడు అమ్మవారి శ్రీ లలితా దేవి ఉపస్థితులై ఉంటారు. అమ్మవారు శ్రీ లలితా దేవి అనంతరకాల ప్రతిష్ట అని భావించవచ్చు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న పెక్కు శివాలయాలలో అమ్మవారిని స్థానిక పాలకులు లేదా గ్రామస్థులు ప్రతిష్ఠించినట్లు చెబుతారు.

గర్భాలయంలో చిన్న పానవట్టం మీద నాగాభరణధారిగా శ్రీ నాగేశ్వరస్వామి లింగ రూపంలో చక్కని అలంకరణలో నేత్రానందంగా భక్తులకు దర్శనం ప్రసాదిస్తారు. కాశీ లింగంగా పిలవబడే ఈ లింగం పైన బ్రహ్మసూత్రం ఉండదు.

నిత్య పూజలు నియమంగా జరిగే ఈ ఆలయంలో ప్రతి నెలా ఒక విశేష పూజ, కార్తిక మాస పూజలు, శివరాత్రి మహోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. పరిశుభ్ర వాతావరణంలో గ్రామస్థులు, అధికారులు సమిష్టిగా ఆలయ నిర్వహణ చేస్తున్నారు. గణేశ, నవరాత్రి, మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# శుభసూచకం 'ఆరుద్ర' ఆగమనం

**భూమిపై కోట్లాది జీవరాసులు జీవిస్తున్నాయి. మనుషులే కాక పశుపక్షాదులు, క్రిమికీటకాలు, పురుగులకు భూ ప్రపంచం ఆవాసం అనేది జగమెరిగిన సత్యం. అయితే కొన్ని పురుగులు కొన్ని సమయాలలో మాత్రమే మనకు కనిపిస్తాయి. అటువంటి అరుదైన పురుగుల్లో ఒకటి అరుద్ర పురుగు.**

పట్నవాసులకు పువ్వులాంటి అందమైన ఈ పురుగు గురించి తెలియదు అంటే అతిశయోక్తి కాదు. పల్లెల్లో, పంట పొలాల్లో తిరిగే వారికి ఆరుద్ర పురుగులు కేవలం సీజన్లో మాత్రమే కనిపించి కనువిందు చేస్తుంటాయి. ఆరుద్ర పురుగును రెడ్ వెల్వెట్ మైట్, వర్షపు పురుగు అని పిలుస్తుంటారు.

## జీవశాస్త్ర చరిత్ర

జీవశాస్త్రం ప్రకారం అరుద్ర పురుగుల చరిత్ర చాలా పురాతనమైనది. ఇది పురాతన అరాక్నిడ్ జాతికి చెందినదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తైవాన్ సమీపంలో దొరికిన ఫాసిల్స్‌లో ఇలాంటి అరాక్నిడ్ అనవాళ్లు సుమారు 20 మిలియన్ సంవత్సరాల నాటివిగా గుర్తించారు. కవి బాబిల్ వార్మ్ లాంటి జీవులతో సంబంధం కలిగి ఉండవచ్చు అనేది కొందరి అభిప్రాయం.

## ఆరుద్ర పురుగు రూపం

ఇవి ఎరుపు రంగులో మొఖమల్ వస్త్రాన్ని చుట్టుకున్నట్లు బొద్దుగా, ఎర్రగా ఉంటాయి. చూడటానికి అందంగా ఉంటాయి, పంటలకు హాని చేయవు. అరుద్ర పురుగు ట్రోంబిడిడే కుటుంబానికి చెందిన చిన్న (అరాక్నిడ్) ఎనిమిది కాళ్ల జీవి. ఇవి సాధారణంగా 4 మి.మీ. కంటే చిన్నవిగా ఉంటాయి. కానీ కొన్ని జాతులు 12 మి.మీ. వరకు కూడా పెరుగుతాయి.

ఆరుద్ర పురుగులన్నిటిలో సర్వసామాన్య లక్షణం ఎలిట్రా అనే ఆకర్షణీయమైన, నున్నని మెరిసే పైపెంకు కలిగివుండడం. వాస్తవానికి ఆరుద్ర పురుగులకు ఉండే ఒక జత రెక్కలను ఈ ఎలిట్రా రక్షా కవచాల వలే కప్పి ఉంచుతాయి.

సాధారణంగా ఎప్పుడు పడితే అప్పుడు కనిపించని ఈ కీటకం రెక్కలు ఎగిరేటప్పుడు ఎలిట్రా చాటు నుంచి బయటికొస్తాయి. మన ప్రాంతంలో సర్వసాధారణంగా కనిపించే అరుద్ర పురుగులలో మూడు ప్రధానమైన రకాల్లో మొదటిది: ఎర్రని పైపెంకు కలిగి, దాని మీద ఏడు నల్లని చుక్కలు కలిగి ఉంటుంది. రెండవది: ఎర్రని పైపెంకు మీద నల్లటి గీతలు కలిగి ఉంటుంది. ఎర్రటి పై పెంకు మీద ఏడు



నల్లని చుక్కలు కలిగిన ఆరుద్ర పురుగు శాస్త్రీయ నామం కాక్సినెల్లా సెప్టంపంక్టేటా.

రైతులు దుక్కి దున్నిన పిదప తొలకరి జల్లులు పడగానే అదుద్ర పురుగులు పొలాల్లో కనిపిస్తూ ఉంటాయి. ఆరుద్ర కార్తిలో ఈ పురుగులు తారసపడుతూ ఉంటాయి. ఒకప్పుడు ఈ పురుగులు పొలాల్లో చాలా ఎక్కువగా కనిపించేవి. ఇప్పుడు క్రిమి సంహారక మందుల పిచికారీ, రసాయన ఎరువుల వినియోగం పెరుగుతున్న కాలుష్యం.. ఇత్యాది కారణాల వల్ల వీటి ఉనికి కూడా ప్రశ్నార్థకమైంది. ఎప్పుడూ భూమి లోపల నివాసం ఉండే ఈ పురుగులు తొలకరి వానలు పడ్డప్పుడు మాత్రమే బయటకు వచ్చి కనువిందు చేస్తాయి. అరుద్ర పురుగు గుడ్డు, లార్వా ప్రోటోనింఫ్, డ్యూటోనింఫ్, ట్రైటోనింఫ్, వయోజన (పురుష లేదా స్త్రీ) దశలలో జీవిస్తుంది.

## శుభసూచకం

తెలుగు సంప్రదాయంలో అరుద్ర పురుగు ఆరుద్ర కార్తె (జూన్-జులై నెలల్లో వచ్చే వర్షాకాలం ఆరంభంలో సమయంలో పొలాల్లో కనిపిస్తుంటాయి) దున్నిన నేలలోని చీడపురుగుల లార్వాలను తిని పంట వేయకముందే ఆరుద్ర పురుగులు రైతుకు మేలు చేకూరుస్తాయి. ఇవి పొలంలో కనిపిస్తే రైతులు ఎంతో సంబరపడిపోతారు. ఆ యేడాది వర్షాలు బాగా పడతాయనీ కాలువలు, చెరువులు నీటితో నిండుతాయని, పంట దిగుబడి సమృద్ధిగా ఉంటుందని రైతులు నమ్ముతారు. ఈ నమ్మకం రైతుల్లో ఆనందం, శుభసూచక భావనను కలిగిస్తుంది. ఏ రైతు కూడా ఆరుద్ర పురుగుల్ని చంపడు, ఎవ్వరినీ చంపనీయడు. వీటిని దేవుని ప్రతిరూపంగా వీటిని భావించి రైతులు కొలుస్తారు. ఆరుద్ర పురుగు దర్శనంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే బిలబిలమంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వచ్చేస్తాయి. అలా ఆరుద్ర పురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ, రైతన్నలు చక్కగా వ్యవసాయం చేసుకోవచ్చని నమ్ముతుంటారు.

అలా ఆరుద్ర పురుగులకు, రైతులకు అవినాభావ సంబంధం ఉంది. ఎర్రగా, బొద్దుగా, చూడ ముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు శుభసూచకంగా భావిస్తారు.

వీటిని చూడగానే ఇక వ్యవసాయం పనులు మొదలు పెట్టుకోవచ్చని ఆనందంగా రైతులు పొలాల వైపుకు పరుగులు తీస్తారు. ఎర్రగా, బొద్దుగా, చక్కటి రంగులో పట్టులా మెరిసిపోయే అందమైన ఈ పురుగులు తొలకరి వర్షాలు కురవగానే కుప్పలు కుప్పలుగా కనిపించి కనువిందు చేస్తాయి. వ్యవసాయం పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తి అనుకూలమైంది. అన్నదాతలకు పర్యావరణ వేస్తాలుగా పిలుచుకొనే ఆరుద్ర పురుగులు పంట పొలాల్లో కనువిందు చేస్తున్నాయి. వాతావరణం చల్లబడి తొలకరి జల్లులు కురవగానే నేలపై ఎర్రని బొట్లుగా మెరుస్తూ ఆరుద్ర పురుగులు అహ్లాదాన్ని పంచుతాయి. ఆరుద్ర కార్తిలో మాత్రమే కనిపించే అరుదైన పురుగు ఆరుద్ర. అందుకే దాన్ని అరుద్ర పురుగు అంటారు. ఇవి ప్రకృతికి మాత్రమే కాక రైతు నేస్తాలుగా ప్రసిద్ధి చెందాయి.

ప్రతి యేడాది తొలకరి సమయంలో ఇవి గుంపులు గుంపులుగా తిరుగాడుతుంటాయి. ఆరుద్ర పురుగులు మృదువుగా వుండి ముట్టుకుంటే వెల్వెట్ వస్త్రంలా మెత్తగా అనిపిస్తాయి. చూడగానే పట్టుకోవాలనిపించేంత ముద్దుగా.. అందంగా.. కదిలే బొమ్మల్లా ఉంటాయి. పురుగులంటే భయపడే చిన్న పిల్లలు సైతం ఈ ఆరుద్ర పురుగుల్ని పట్టుకుంటారు. మనం ముట్టుకుంటే చాలు అవి ముడుచుకుంటాయి. కాసేపు ఏ కదలికా లేకుండా ఉంటే మెల్లగా నడవడం మొదలెడతాయి.

ఆరుద్ర పురుగును తెలుగు ప్రాంతాల్లో ఇంద్రగోప, చందమామ, కుంకుమ పురుగు; కొన్ని ప్రాంతాలలో లేడీ బర్డ్, లేడీ బర్డ్ బీటిల్స్.. అని వివిధ పేర్లతో పిలుస్తారు. ఈ పేర్లు దాని ఎరుపు రంగు, అందమైన రూపాన్ని సూచిస్తాయి. ఒకప్పుడు పల్లెల్లో పిల్లలు ఈ పురుగులతో అడుకునేవారు. వీటిని అగ్గిపెట్టెలు, పెన్సిళ్లు, పెన్నులు దాచుకునే బాక్సుల్లో దాచి, గడ్డిని ఆహారంగా పెట్టేవారు. ఇటువంటి దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఎక్కువగా కనిపించేవి. కానీ ఆధునిక కాలంలో ఈ ఆచారం తగ్గుముఖం పట్టింది. ఆరుద్ర పురుగును చూడటమే ఒక గొప్ప విషయంగా మారింది. ఆరుద్ర పురుగులు వ్యవసాయానికి హానికరం కాదు. ఇవి దున్నిన నేలలోని హానికరమైన కీటకాల లార్వాలను తిని, పంటలకు ముందస్తు రక్షణ కల్పిస్తాయి. ఈ లక్షణం వల్ల రైతులు వీటిని శుభసూచకంగా భావిస్తారు.



గతంలో ఆరుద్ర పురుగులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించేవి. కానీ ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పురుగుమందుల వాడకం, పర్యావరణ మార్పుల వల్ల వీటి సంఖ్య తగ్గుతోంది. ఇప్పటి తరంలో వీటి గురించి తెలిసినవారు చాలా తక్కువగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. తెలుగు సాహిత్యంలో సైతం ఆరుద్ర పురుగు అందాన్ని కవులు వర్ణించారు. ఆరుద్ర పురుగుల వల్ల భూములు గుల్లబారి సారవంతంగా మారతాయి. పంట పోషకాలు అంది పంటలు అధికంగా పండుతాయి. వర్షాకాలం పోయిన పిదప ఆరుద్ర పురుగులు భూమిలోనే 40 అడుగుల లోతుకు వెళ్లి నివాసం ఏర్పరచుకుంటాయి. తిరిగి వర్షాకాలం ఆరుద్ర కార్తి సమయంలోనే బొరియల నుండి బయటకు వస్తాయి. పచ్చికలోనే కాదు అరబ్ దేశాలలోని ఎడారి ప్రాంతాల్లో సైతం అరుద్ర పురుగులు కనువిందు చేస్తుంటాయి.

ఆరుద్ర అందమైన, పట్టు లాంటి సుతిమెత్తని పురుగు. ఏడాదికోసారి వర్షాకాలంలో బొరియల్లో నుండి ఇవి బయటకు వచ్చి నేత్రానందం చేస్తాయి. మూలిగే నక్కపై తాటాకు పడినట్లు అంతరించిపోతున్న ఆరుద్ర పురుగులను సైతం వేటాడే బృందాలు బయలుచేరాయి. వీటిని సేకరించి ఇస్తే కిలోల లెక్కన కొనేందుకు ఏజెంట్లు బయలుదేరారు. ఆరుద్ర పురుగుల నుండి సేకరించిన నూనెను పక్షవాతం రోగులకు వాడే తైలంలోనూ, లైంగిక సామర్థ్యం, వీర్యాభివృద్ధిని పెంచేందుకు ఆయుర్వేద, యునానీ మందుల తయారీలోనూ వాడుతున్నారు. కొన్ని దేశాల వారు తాంబూలంలో కూడా ఈ పురుగుల్ని వాడుతున్నారు. కొందరైతే ఈ పురుగులను సౌందర్య సాధనాల తయారీలో వాడుతున్నారు.

మనిషిలో పెరిగిపోయిన స్వార్థం వల్ల ప్రకృతి నేస్తం, రైతు నేస్తంగా భావించే ఆరుద్ర పురుగులు అంతరిస్తున్న పురుగుల జాబితాలో చేరాయి.

**- షేక్ అబ్దుల్ హాకీం జాని**

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

## మేషం

ఈ వారం ఉపయుక్తంలేని సంభాషణలు చర్చలకు ఏమాత్రం తావివ్వరు. అవిశ్రాంతంగా శ్రమిస్తారు. గృహం కొనుగోలు చేయాలన్న ఆలోచనలు బలపడతాయి. పనిభారం వలన వత్తిడికి లోనవుతారు. ముఖ్యమైన డైరీ సకాలంలో కనపడక తాత్కాలికంగా చికాకు పడుతారు. నిత్యం సుబ్రమణ్య పశుపతి కంకణం ధరించండి.

## వృషభం

ఈ వారం దీర్ఘకాలిక సమస్యలు కొంతవరకు తీరుతాయి. నిత్యం దీపారాధన కుందిలో రెండు చుక్కలు పరిమళ గంధాన్ని వేయాలి. ఇంటా బయటా అనుకూలంగా ఉంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ప్రముఖుల కలయిక. ప్రకృతి వైద్యం యోగా వంటి సనాతన ఆరోగ్య సూత్రాల పట్ల ఆకర్షితులవుతారు.

## మిథునం

ఈ వారం సంతానంనకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మిత్రుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. లక్ష్మీప్రదమైన ముఖానికి, ఐశ్వర్య ప్రాప్తికి ఈ లక్ష్మి చందనం ధరించడం వలన మేలు జరుగుతుంది. సానుకూల ఫలితాలను సాధిస్తారు. రెండు పడవల మీద ప్రయాణం శ్రేయస్కారం కాదు.

## కర్కాటకం

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బాధలు తప్పవు. ప్రయాణాలలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. అష్టగణపతి పీఠానికి పరిమళ గంధంరాసి, ఆరావళి కుంకుమ పెట్టి నిత్యం పూజ చేయటం వలన సమస్యలు కొంత వరకు తీరుతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

## సింహం

ఈ వారం కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. నిత్యం హనుమ సింధూరం ఉపయోగించడం వలన మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శుభకార్యాలు ఘనంగా చేస్తారు. రెండు, మూడు విధాలుగా ఆర్థిక లాభాలు వుంటాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుని ముందుకు సాగుతారు. ఉద్యోగులు పదోన్నతులు పొందుతారు.

## కన్య

ఈ వారం విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. నిత్యం పాశుపతకంకణం ధరించడంవలన ఉద్యోగ ప్రాప్తిలో ఎదురైన విఘ్నాలు నశిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం, ఎంతో కాలంగా దూరంగా ఉంటున్నటువంటి బాల్యమిత్రులతోటి ఈ వారం తిరిగి పరిచయం ఏర్పడుతుంది.

## తుల

ఈ వారం ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. మాటల వరకే మీ కోపాన్ని పరిమితం చేసి లాభపడగలుగుతారు. సరికొత్త నిర్ణయాలు తీసుకుంటారు. అమలు పరచడానికి కావలసిన సహచర సిబ్బందిని సమకూర్చుకుంటారు. విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేస్తారు. మానసిక వేదనకు ఏ మాత్రం తావివ్వరు. నానారకాల అరిష్టాలు, శత్రుబాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి.

## వృశ్చికం

ఈ వారం శుభకార్యాలు ఘనంగా చేస్తారు. ఆర్థికాభివృద్ధి కొరకు లక్ష్మీకటాక్షాన్ని ఉపయోగించండి. ఇది చాలా మంచిది. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సన్నిహితులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కరించుకుంటారు. మీరు కుదుర్చుకునే అగ్రిమెంట్స్ కలిసివస్తాయి. ఆదాయ, వ్యయాలలో సమతుల్యత ఏర్పడుతుంది. చాలా వరకు మీ అంచనాలు నిజమవుతాయి.

## ధనస్సు

ఈ వారం ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ప్రతి నిత్యం ఇంట్లో కానీ, వ్యాపారా ప్రదేశాలలో కానీ అష్టమూలికా గుగ్గిలంతో, దైవికం అనే పొడితో ధూపం వేయండి. కుటుంబపురోభివృద్ధి బాగుంటుంది. ఉన్నతాధికారుల మెప్పును అందుకోగలుగుతారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కొనుగోలు అమ్మకాలు సాగిస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మీరు ప్రవర్తించ లేకపోతారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు

## మకరం

ఈ వారం అత్యంత ఆప్తులని మీరు భావించి వారితో అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి. మీ శక్తి సామర్థ్యాలు మీకన్నా ఇతరులకు ఎక్కువగా ఉపయోగపడతాయి. అర్థికాభివృద్ధి కొరకు లక్ష్మి కటాక్షాన్ని ఉపయోగించండి. ఇదిచాలా మంచిది ఈ వారం ఆల్లుదనంగా ఒకదారికి తాడ కువస్తారు. ఖర్చు అధికంగా ఉన్న సంతానపరమైన పురోభివృద్ధి బాగుంటుంది. మిత్రుల వలన మేలు జరుగుతుంది.


## కుంభం


ఈ వారం గుడ్‌విల్‌ను మరింతగా పెంపొందుతుంది. అదృష్టాన్ని ఎక్కువగా నమ్ముతారు. అలాగని చేతులు కట్టుకుని ఊరికే కూర్చోరు. ప్రింటింగ్ స్టేషనరీ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటు ది. భాగస్వాములతో అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి. ముఖ్యమైన వ్యవహారాల వలన మానసిక వత్తిడి ఏర్పడుతుంది. లక్ష్మీప్రదమైన ముఖానికి, ఐశ్వర్యప్రాప్తికి ఈలక్ష్మి చందనం ధరించడం వలన మేలు జరుగుతుంది.


## మీనం

ఈ వారం వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించండి. దైవదర్శనం చేసుకుంటారు. అ ములతో ఏర్పడిన అంతర్గత విభేదాలు తలగొప్పగా పరిచిసాయి. తెల్లజిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయటం వలన విఘ్నేశ్వరుని అనుగ్రహం లభిస్తుంది. ఆర్థిక లావాదేవీలు కొంత ఊరట కలిగిస్తాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. సభలు, సమావేదాలలో చురుకుగా పాల్గొంటారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


మన పాత 'పాకీజా' సినిమాను 'శ్రీజా' పేరుతో రీ రిలీజ్ చేద్దాం.. ట్రెండీగా ఉంటుంది!!
Zakir...


'సొల్లు' నే కదా సర్ మాట్లాడేది.. తర్వాత మాట్లాడుకోవచ్చుగా సర్.. గంట నుండి ఉన్నాను!
-ఆఫీసు-
Zakir...


AI వార్తలు: మీ బాత్రూం లో బకెట్ నిండిపోయింది..
స్టవ్ మీద ఉన్న కూర కాసేపట్లో మాడిపోతుంది..
సాయంత్రం వచ్చేస్తా అని వెళ్లిన మీ ఆయన ఈరోజు రాడు...!!
Zakir...



ఆఫ్రికాలోని ది కోర్ రాయల్ డీ టీబిల్ అనే
ప్రాంతానికి చెందిన చిత్రాలివి.
స్థానికులు సహజ రంగులతో కళాత్మకంగా
నిర్మించుకున్న మట్టి ఇళ్లు ఇవి.











